www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar

కరీంనగర్ | సంపుటి : 02 | సంచిక : 289 | బుధవారం | 16 ఏప్రిల్, 2025

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681


## ట్రిలియన్ డాలర్ల ఎకానమి..




- ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఆర్థిక వ్యవస్థ పురోగతి
- ఇతర నగరాలకన్నా హైదరాబాద్‌లో 56శాతం వృద్ధి రేటు
- సిటిజన్‌గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ప్రారంభోత్సవంలో శ్రీధర్ బాబు

02

## మహిళలకు వడ్డీలేని రుణాలు



- స్త్రీ సమ్మిట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వడ్డీలేని రుణాలతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశం లభించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తోందని, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు ఫ్రీ రుణాలు ఇస్తున్నామని చెప్పారు.

02



## మే15 నుంచి సరస్వతీ పుష్కరాలు

- కాళేశ్వరంలో పుష్కర ఏర్పాట్లు.. మొబైల్ యాప్ ప్రారంభం

02

# ఊరుకోం

## ఎవ్వరు పార్టీ లైన్ దాటినా ఉపేక్షించం

### అధిష్ఠానం పరిధిలో మంత్రివర్గ విస్తరణ

- సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- హైదరాబాద్ వీడి గ్రామాలకు వెళ్లాల్సిందే
- సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండండి
- విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
- పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ సూచన



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తున్న వ్యాఖ్యలు దుమారం రేపుతున్న వేళ.. ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి సున్నితంగా హెచ్చరిక చేశారు. ఎవ్వరు కూడా పార్టీ లైన్ దాటి మాట్లాడవద్దని అన్నారు. మంత్రివర్గ విస్తరణ అన్నది అధిష్ఠానం నిర్ణయమని కూడా స్పష్టం చేశారు. శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో జరిగిన కాంగ్రెస్ శాసనభాపక్ష సమావేశంలో సీఎం రేవంత్ మాట్లాడారు. తనకు మంత్రి పదవి రాకుండా జానా రెడ్డి అడ్డుకుంటున్నారని కోమటిరెడ్డి

మిగతా 2 లో




## ఇందిరమ్మ లబ్ధిదారులకు శుభవార్త

- తొలి విడతలో 12 మందికి చెక్కుల పంపిణీ

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్ల కలను సాకారం చేసే దిశగా మరో అడుగు వేసింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి విడతలో లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించే కార్యక్రమంలో భాగంగా, ముఖ్యమంత్రి మంగళవారం 12 మంది లబ్ధిదారులకు లాంఛనంగా ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రూ. 20.19 కోట్లను 2,019 మంది లబ్ధిదారులకు విడుదల చేశారు. పైలట్ ప్రాజెక్ట్ కింద మొదటి విడతలో 70,122 ఇళ్లను మంజూరు చేసిన ప్రభుత్వం, ఇందులో

మిగతా 2 లో

## ప్రభుత్వాన్ని కూలుస్తామని ఎక్కడా అనలేదు



- ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తోందని చెప్పాం
- తామంతా కేసీఆర్ ఆత్మలమేనన్న కొత్త ప్రభాకర్ రెడ్డి

03

## నోవాటెల్‌లో సీఎంకు తప్పిన ప్రమాదం

- ఓవర్‌లోడ్‌తో హోటల్ లిఫ్ట్‌లో టెక్నికల్ సమస్య
- లిఫ్ట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న సిబ్బంది

02




## ఏసీబీ వలలో అర్బన్ బయోడైవర్సిటీ అధికారి

- ఓ కాంట్రాక్టర్ వద్ద రూ. 70 వేలు లంచం డిమాండ్

02



## దుబాయ్‌లో ఇద్దరి హత్య

ఆలస్యంగా వెలుగులోకి ఘటన

ఫోన్ చేసి కుటుంబాలకు బండి పరామర్శ

మృతదేహాలను రప్పించేందుకు కృషి





02

## ప్రభుత్వాన్ని కూల్చే దమ్ముందా!

- అధికారం లేకపోవడంతో బీఆర్ఎస్ కుయుక్తులు
- మాజీ మంత్రి, సలహాదారు షబ్బీర్ వ్యాఖ్యలు



03

## భూముల అమ్మకంలో బీఆర్ఎస్‌తో పోటీ

- అప్పులు, భూముల అమ్మకంతో నడుస్తున్న ప్రభుత్వం
- జాతీయ అధ్యక్షుడి రేసులో లేను
- తెలంగాణలోనూ ఎన్డీఏ కూటమి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

03



## పింక్‌బుక్‌లో బెదిరింపు నేతల పేర్లు

- వారిని వదిలిపెట్టం
- రజతోత్సవ సభకు రాకుండా బెదిరింపులు
- సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ కవిత ఘాటు వ్యాఖ్యలు

03



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..





## ఏసీబీ వలలో బయోడైవర్సిటీ అధికారి

**ప్రజానావ, హైదరాబాద్:** ఏసీబీకి మరో తిమింగలంచిక్కింది. లంచం తీసుకుంటుం డగా పట్టుకున్నారు. శేరిలింగంపల్లి జోనల్ మున్సిపల్ కార్యాలయంలో అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ ఏసీబీ వలకు చిక్కారు. రూ.70 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. శ్రీనివాస్.. చార్మినార్ జోన్ ఇన్‌ఛార్జిగా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో చాంద్రాయణగుట్ట సర్కిల్‌లో అర్బన్ బయో డైవర్సిటీ- వింగ్‌లో రూ. 45 లక్షల మొక్కల కాంట్రాక్ట్‌కు సంబంధించిన బిల్లులను క్లియర్ చేయడానికి కాంట్రాక్టర్ దగ్గర నుంచి శ్రీనివాస్ రూ.2,20,000 లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా రూ.70,000 లంచం తీసుకుంటు-ండగా ఆయన్ని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టు-కున్నారు.

## రేవంత్ కేసుపై హైకోర్టు విచారణ

**ప్రజానావ, హైదరాబాద్:** గతంలో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. గోపన్‌పల్లిలోని భూ వివాదంలో ఓ వ్యక్తి ఫిర్యాదుతో.. 2016లో రేవంత్‌రెడ్డిపై కేసు నమోదైంది. ప్రస్తుతం ఆ కేసు రంగారెడ్డి జిల్లా కోర్టులో విచారణలో ఉంది. కేసును కొట్టివేయాలంటూ 2020లో రేవంత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ కె. లక్ష్మణ్.. పిటిషన్‌ను వేరే బెంచ్‌కు బదిలీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

## నేటి నుంచి సీఎం జపాన్ పర్యటన

**ప్రజానావ, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం జపాన్ పర్యటనకు బయల్దేర నున్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, రాష్ట్ర అధికారుల ప్రతినిధి బృందం సీఎం వెంట వెళ్లనున్నారు. ఏప్రిల్ 16 నుంచి 22 వరకు తెలంగాణ ప్రతినిధుల బృందం జపాన్ లో పర్యటించనుంది. టోక్యో, మౌంట్ ఫుజి, ఒసాకా, హీరోషిమా లో ముఖ్యమంత్రి బృందం పర్యటించనుంది. ఓసాకా వరల్డ్ ఎక్స్పో 2025లో తెలంగాణ పెవిలియన్ ను ప్రారంభిస్తారు. ఈ పర్యటనలో భాగంగా ఆ దేశానికి చెందిన ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక వేత్తలు, పలువురు ప్రతినిధులతో ముఖ్యమంత్రి బృందం సమావేశ మవుతుంది. రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామిక సాంకేతిక సహకారంపై ప్రధానంగా చర్చలు జరుపనున్నారు.

## మే15 నుంచి సరస్వతీ పుష్కరాలు

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు జరగనున్నాయి. పుష్కరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్, మొబైల్ యాప్, పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. పుష్కరాల వేళ భక్తులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పుష్కరాలకు నిత్యం 50 వేల నుంచి లక్ష మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. కాళేశ్వరంలో 17 అడుగుల ఏకశిల రాతి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు- తెలిపారు. భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో టెంట్ సిటీ- నిర్మించనున్నట్లు చెప్పారు. పుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ. 35 కోట్లు- కేటాయించిందని మంత్రులు పేర్కొన్నారు. తెలంగాణ సహా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు వస్తారని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య

**ప్రజానావ, హైదరాబాద్:** సికింద్రాబాద్ పరిధిలోని కార్ఖానాలో విషాద సంఘటన చోటు-చేసుకుంది. వీణ(60), మీనా(59) అనే ఇద్దరు అక్కాచెల్లెళ్లు.. ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. ఇంట్లోకి వెళ్లి మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఐదు రోజుల క్రితమే వారిద్దరు ఆత్మహత్య చేసుకున్నట్లు- పోలీసులు గుర్తించారు. అయితే, వారి చావుకు కారణం తెలియరాలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

## దుబాయ్‌లో ఇద్దరి హత్య





**ప్రజానావ, హైదరాబాద్:** పాకిస్తానీ చేతిలో దుబాయిలో దారుణంగా హత్యకు గురైన ప్రేమ్ సాగర్ కుటుంబ సభ్యులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఫోన్ చేసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. జరిగిన ఘటనపై ఆరా తీశారు. ప్రేమ్ సాగర్ తోపాటు హత్యకు గురైన నిజామాబాద్ కు చెందిన శ్రీనివాస్ మృత దేహాలను వీలైనంత తొందరగా స్వదేశానికి రప్పించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతోపాటు మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని, వారికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. మరోవైపు కేంద్ర మంత్రి ఈ సమాచారం తెలుసుకున్న వెంటనే విదేశీ వ్యవహారాల మంత్రి కార్యాలయంతో మాట్లాడారు. వెంటనే దుబాయిలో హత్యకు గురైన ప్రేమ్ సాగర్, శ్రీనివాస్ మృత దేహాలను స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో విదేశాంగ శాఖ కార్యాలయ అధికారులు సైతం దుబాయి అధికారులతో మాట్లాడారు. వీలైనంత తొందరలో ఆయా మృత దేహాలను స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు ఎప్పటికప్పుడు విదేశాంగ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని హోంమంత్రిత్వ శాఖ అధికారులను ఆదేశించారు.

# పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదు



మొదటి పేజీ తరువాయి

రాజగోపాల్ రెడ్డి రచ్చ చేస్తే.. పదేళ్లు పార్టీని కాపాడుకున్న మమ్మల్ని కాదని.. వేరే పార్టీలు తిరిగొచ్చిన వారికి పదవులు ఇస్తారా అని ప్రేమ్‌సాగర్ రావు పరోక్షంగా ప్రభుత్వానికే వార్నింగ్ ఇచ్చారు. ఇలా ఒక్కొక్కరుగా కాంగ్రెస్ ఎమ్మెల్యే బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంపై సీఎం రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు హెచ్చరికలు చేశారు. మంత్రి పదవులను అధిష్ఠానం చూసుకుంటుందని తెలిపారు. పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలను హెచ్చరించారు. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ అని చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానందే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని అన్నారు. మీరు మాట్లాడేదంతా రికార్డవుతుందని హెచ్చరించారు. అలాగే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ సోషల్‌మీడియా వాడటం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వంపై నెగిటివ్ ప్రచారం చేస్తుంటే.. ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పలువురు ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారని అన్నారు. వీకెండ్ రాజకీయాలు చేయొద్దని సూచించారు. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్షం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. పలువురు ఎమ్మెల్యేలను హెచ్చరించినట్లు తెలుస్తోంది. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. దీనిపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని సీఎం తేల్చి చెప్పారు. మంత్రి పదవులపై ఒకరికి మించి మరొకరు లీకులు ఇస్తున్నారని అసహనం వ్యక్తం చేసిన సీఎం.. ఇష్టం వచ్చినట్లు- మాట్లాడితే మంత్రి పదవులు రావన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు జాగ్రత్తగా పని చేసుకోవాలని సూచించారు. కాగా, మంత్రి వర్గ విస్తరణపై కొందరు ఆశావహులు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఏకంగా హుకుం జారీ చేశారు. మరోవైపు.. మంత్రి పదవి విషయంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఇలా మంత్రి వర్గ విస్తరణపై ఆశవహులు బహిరంగంగ మాట్లాతుండటంతోనే తాజాగా జరిగిన సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశర చేశారు. ఎమ్మెల్యేలు ప్రతి గ్రామంలో పర్యటించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటించాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకమవుతా. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మి.. బుల్డోజర్లు పంపిస్తున్నారని ప్రధాని మాట్లాడుతున్నారు. భాజపా, భారాస కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తెలంగాణ మోడల్‌పై దేశంలో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే భాజపా, భారాస ఒక్కటయ్యాయి. సన్నబియ్యం మన పథకం.. మన పేటెంట్, మన బ్రాండ్. భాజపా పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదో చెప్పాలని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సమావేశంలో మంత్రులు భట్టి విక్రమార్క,పొంగులేటి, శ్రీధర్ బాబు, పొన్నం, పిసిస చీఫ్ మహేశ్కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నోవాటెల్‌లో సీఎంకు తప్పిన ప్రమాదం




**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తృటిలో ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నోవాటెల్ హోటల్‌లో రేవంత్ రెడ్డి ఎక్కిన లిఫ్ట్ ఓవర్‌లోడ్ కారణంగా సాంకేతకి సమస్య ఏర్పడింది. ఓవర్ వెయిట్‌తో ఉండాల్సిన ఎత్తు కంటే లిఫ్ట్ లోపలికి దిగిపోయింది. సీఎం ఎక్కిన లిఫ్ట్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో 13 మంది ఎక్కడంతో లిఫ్ట్ మొరాయించింది. ఓవర్ వెయిట్ కారణంగా ఉండాల్సిన ఎత్తు కంటే లోపలికి దిగిపోయింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు, సెక్యూరిటీ- సిబ్బంది లిఫ్ట్‌ను ఓపెన్ చేసి వేరే లిఫ్ట్‌లో సీఎంను కిందకు పంపించారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి సహా అధికారులు, సిబ్బంది ఆందోళన చెందారు. ఏం జరుగుతుందో అర్థంకాక కాసేపు అయోమయానికి గురయ్యారు. అనంతరం పెద్ద ప్రమాదం ఏమీ లేదని తెలుసుకుని లిఫ్ట్ నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం మరో లిఫ్ట్‌లో ముఖ్యమంత్రిని అధికారులు తరలించారు. సీఎల్పీ సమావేశం సందర్భం హోటల్ వద్దకు సీఎం రేవంత్ రెడ్డి చేరుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ విప్‌లు, కొంతమంది ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి ఆహ్వానం పలికి హోటల్ లోపలికి తీసుకెళ్లారు. అయితే పైఅంతస్తుకు వెళ్లే క్రమంలో 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో రేవంత్ రెడ్డితోపాటు 13 మంది ఎక్కారు. దీంతో లిఫ్ట్ ఉండాల్సిన స్థానం కంటే కిందికి కుంగిపోయింది. వెంటనే అలారం మోగడంతో అధికారులు, హోటల్ సిబ్బంది అప్రమత్తం అయ్యారు. హుటాహుటిన లిఫ్ట్ వద్దకు పరుగులు పెట్టారు. అనంతరం సీఎం సహా అందరినీ లిఫ్ట్ నుంచి బయటకు తీసుకువచ్చారు. అనంతరం మరో లిఫ్ట్‌లో సమావేశం జరుగుతున్న సెకండ్ ఫ్లోర్‌కు తీసుకెళ్లారు. రేవంత్ రెడ్డి ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో ఎమ్మెల్యేలు, అధికారులు, హోటల్ సిబ్బంది అంతా ఊపిరి పీల్చుకున్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి త్రుటిలో ప్రమాదం తప్పింది.

# వడ్డీలేని రుణాలతో స్వయం ఉపాధి

### స్త్రీ సమ్మిట్ కార్యక్రమంలో భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఏప్రిల్ 15:** వడ్డీలేని రుణాలతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశం లభించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తోందని, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులుకు ఫ్రీ రుణాలు ఇస్తున్నామని చెప్పారు. స్వయం సహాయక గ్రూపులకు రూ.20 వేల కోట్లకు పైగా లోన్లు ఇస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ తాజ్ డక్కన్ హోటల్ లో నిర్వహించిన స్త్రీ సమ్మిట్ 2.0 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు భట్టీ-. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ- కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రారంభించి డిప్యూటీ సీఎం.. మహిళా సాధికారత కోసమే స్త్రీ సమ్మిట్ నిర్వహిస్తున్నామని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఈ సందర్భంగా డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఒకవైపు స్త్రీలను దేవతలుగా చూస్తేనే మరోవైపు కంట్రోల్ చేయాలనే ప్రయత్నం తరతరాలుగా జరుగుతూనే ఉందని అన్నారు. హిందూ కోడ్ బిల్లుతోనే మహిళా సాధికారత ప్రారంభం అయ్యిందని, అంబేద్కర్ వల్లే మహిళలకు హక్కులు లభించాయని గుర్తు చేశారు. మహిళలకు వారతసత్వ హక్కులు లభించాయని తెలిపారు. తెలంగాణలో మహిళలకు ఫ్రీ బస్ స్కీం సక్సెస్ ఫుల్ గా నడుస్తోందని అన్నారు డిప్యూటీ సీఎం. సోలార్ లాంట్ నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించామని, దీంతో సోలర్ లాంట్ నిర్వహణలో మహిళలకు భాగస్వామ్యం లభించిందని అన్నారు. ఇలాంటి స్త్రీ సమ్మిట్ లతో మహిళా సాధికారత సాధించవచ్చుని పిలుపునిచ్చారు.







# ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా..

**ప్రజానావ, హైదరాబాద్:** గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్ మారిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇక్కడ కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ బాగా పెరిగిందని చెప్పారు. అమెరికాకు చెందిన సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో సిటిజన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను మంత్రి ప్రారంభించిన సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. దిల్లీ, చెన్నైలాంటి మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో 56 శాతం వృద్ధి రేటు ఉంది. ఈ క్రమంలో తెలంగాణ దేశంలో 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదిగేందుంకు చేస్తున్న ప్రయత్నానికి దోహదపడుతుందని మంత్రి అన్నారు. ప్రస్తుతం బలమైన ప్రభుత్వ ప్రైవేటు- భాగస్వామ్యంతో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా ముందుకు సాగుతోందని ఆయన వెల్లడించారు. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్‌ను సంస్థలు లీజుకు తీసుకున్నాయి. ఆమ్జెన్, గ్లోబల్ లాజిక్, ఎలీ లిల్లీ, మారియట్, సిగ్నాలాంటి అంతర్జాతీయ సంస్థలు నగరానికి వచ్చాయి. ఏడాది వ్యవధిలో 70కి పైగా గ్లోబల్ కేపబులిటీ సెంటర్‌లు ఏర్పాటయ్యాయి. 2030 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటు-ంది. పెట్టు-బడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వంపై నమ్మకంతో పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని శ్రీధర్‌బాబు అన్నారు. అమెరికాకు చెందిన ఫైనాన్షియల్ సేవల దిగ్గజం సిటిజన్ ఫైనాన్షియల్ గ్రూప్ తాజాగా హైదరాబాదులో టెక్ కంపెని కాగ్నిజెంట్ తో జతకట్టి తన గ్లోబల్ కెపాసిటీ సెంటర్ ఏర్పాటు చేసింది. ఇది హైదరాబాదులోని కాగ్నిజెంట్ క్యాంపస్ లోపలే ఉంటుందని కంపెనీ పేర్కొంది. వాస్తవానికి ఇదొక ఇన్నోవేషన్ హబ్ మాదిరిగా వర్క్ చేస్తుందని కంపెనీ వెల్లడించింది. ఈ జీసీసీ ఏర్పాటు-ద్వారా మార్చి 2026 నాటికి కొత్తగా 1000 హై వ్యాల్యూ కలిగిన ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని వెల్లడించాయి. ఈ సెంటర్ బ్యాంకింగ్ సంస్థలకు రానున్న కాలంలో థర్డ్ పార్టీ సంస్థలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని జీసీసీ పేర్కొంది. హైదరాబాద్‌లో దాదాపు 57,000 మంది సిబ్బందిని కలిగి ఉన్న కాగ్నిజెంట్, దాని ప్లాట్‌ఫారమ్‌లైన న్యూరో, ఎ÷-లోసోర్స్‌లను ఉపయోగించి సిటిజన్స్ జీసీసీకి అదనపు శక్తిని ఇవ్వనుంది. అలాగే క్లౌడ్, డేటా, సైబర్ సెక్యూరిటీ-, ఇంటెలిజెంట్ ఆటోమేషన్ రంగాల్లో భవిష్యత్తు అవసరాలకు తగిన ఉత్పత్తులను కంపెనీ అందించనుంది. అమెరికా చెందిన సిటిజన్స్ సంస్థ, కాగ్నిజెంట్ చేతులు కలపటంపై తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగంలో ఆవిష్కరణలకు ప్రపంచ ప్రధాన కార్యాలయంగా మారిందని కాగ్నిజెంట్ ప్రతినిధి నాగేశ్వర్ చెరుకుపల్లి అన్నారు. పైగా అనేక జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ డెస్టినేషన్ గా మారింది. ప్రస్తుతం హైదరాబాదులో అత్యుత్తమ టాలెంట్ పూల్ అందుబాటులో ఉండటమే ప్రపంచ దేశాలకు చెందిన దిగ్గజ కంపెనీలను ఆకట్టుకోవటానికి కారణంగా నిపుణులు చెబుతున్నారు.

# భూముల అమ్మకంలో బీఆర్ఎస్‌తో పోటీ



- అప్పులు, భూముల అమ్మకంతో నడుస్తున్న ప్రభుత్వం
- జాతీయ అధ్యక్షుడి రేసులో లేను
- తెలంగాణలోనూ ఎన్డీఏ కూటమి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలో భూములు, మద్యం విక్రయాలు, అప్పులతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. భూముల అమ్మకంలో బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పోటీ పడుతోందన్నారు. హెచ్‌సీయూ అంశంలో తనపై కేసు పెడితే ఎదుర్కొనేందుకు సిద్ధమని తెలిపారు. అర్ధరాత్రి ఫ్లడ్ లైట్లు పెట్టి చెట్లను నరికిన ప్రభుత్వాలను చూశామా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు తొందరేమీ లేదని కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికకు మరో వారం రోజుల సమయం పట్టే అవకాశముందని తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడి ప్రతిపాదనల్లో తన పేరు లేదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తమిళనాడులో ఎన్డీఏను పునరుద్ధరించామని.. తెలంగాణలోనూ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ తమ పార్టీ నేత అని.. ఆయన అంశంపై అంతర్గతంగా చర్చించుకుంటామని తెలిపారు. మీడియాతో జరిగిన చిట్‌చాట్ సందర్భంగా పలు కీలక అంశాలపై స్పందించారు. తనను జాతీయ అధ్యక్షుడిగా నియమించనున్నట్టు వస్తున్న ప్రచారాలను ఖండిస్తూ.. ఇప్పటి వరకు దక్షిణాదిలో కేవలం రెండు రాష్ట్రాలకే అధ్యక్షుల నియామకం జరిగిందని, నన్ను జాతీయ అధ్యక్షుడిగా చేయాలన్న ప్రతిపాదన ఎక్కడా లేదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో భూముల అమ్మకం ద్వారా ప్రభుత్వాన్ని నడపాలనే పద్ధతికి తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం చేశారు. భూములు అమ్మడం, అప్పులు చేయడం, మద్యం అమ్మకాలు.. ఇవే ఆదాయం సమకూర్చే మార్గాలుగా ఈ ప్రభుత్వం భావిస్తోంది అంటూ ఆరోపించారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇదే పని చేసింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని చెట్ల కొట్టడంపై ప్రభుత్వాన్ని నిలదీశారు. అటవీ ప్రాంతంలో జంతువులు ఉన్నాయని, తాను ట్విట్టర్‌లో పెట్టిన పోస్ట్‌కు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. అక్కడ జంతువులు ఉంది అవాస్తవమా అంటూ ప్రశ్నించారు. ఈ భూముల వెనుక మా ఎంపీ ఉంటే ఆ పేరును బయటపెట్టండని, ఎవరు అయినా తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే అంటూ ఘాటుగా వ్యాఖ్యా నించారు. హెచ్‌ఐసీయూలో జంతువులు ఉన్న మాట వాస్తవం.. నా మీద కేసు పెట్టిన ఎదుర్కోవడానికి నేను సిద్ధం, ఎప్పుడు ఎన్నికలు జరిగిన కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోతుందని అన్నారు. వేరే రాష్ట్రం వ్యాపారస్తులు ఇక్కడ ప్రభుత్వాన్ని కూల్చుతారు వారికేమి పని.. వక్ఫ్ చట్టంపై ఆందోళన చేయడం అంటే భూ బకాసురులకు వత్తాసు పలికినట్టే అని వ్యాఖ్యానించారు. ఎంఐఎం కబ్జాదారులను పోగేసి ఆందోళన చేస్తుందని, కాకపోతే పేద ముస్లిములకు మాత్రమే ఆందోళన చేసే హక్కు వాళ్లకు ఉందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం వల్ల ఏమీ నష్టమో చెప్పాలని.. ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం జరగదని, వక్ఫ్ చట్టం పైన మేము మా మేనిఫెస్టోలో పెట్టే చేశామని తెలిపారు. ఇక్కడ కూడా మైనారిటీ- వర్గాల్లోకి వెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నామని, ఈ నెల 17న సన్నాహక సమావేశం ఉందని తెలిపారు. ముస్లిం ప్రార్థన మందిరాలకు వక్ఫ్ బోర్డుకు సంబంధం లేదని, మజీదుల ద్వారా వచ్చే ఆదాయంతో వక్ఫ్ బోర్డు నడవదన్నారు. ఎన్నికలన్నప్పుడు ఓటర్లందరినీ కలుస్తాం.. బిఆర్ఎస్, కాంగ్రెస్, ఈ పార్టీ.. ఆ పార్టీ.. అని కాకుండా అందరినీ ఓట్లు అడుగుతామని అన్నారు. ఏ పార్టీ అధికారం లోకి వచ్చిన ఆ పార్టీ పక్కన చేరి ఎంఐఎం ప్రాభల్యం పెంచుకుంటుందన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ లకి బిగ్ బాస్ అసదుద్దీన్ ఒవైసీ అని కామెంట్ చేసారు.



# ఇందిరమ్మ లబ్ధిదారులకు శుభవార్త

మొదటి పేజీ తరువాయి

బేస్‌మెంట్ నిర్మాణం పూర్తి చేసుకున్న 2,019 మందికి ఈ నిధులను అందించింది. ఇప్పటివరకు 13,500 ఇళ్లు గ్రౌండింగ్ పక్రియను పూర్తి చేసుకున్నాయి. ఈ పథకం ద్వారా పేదలకు సొంత ఇల్లు అనే కలను సులభతరం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని తెలిపారు. బేస్‌మెంట్, గోడలు లేదా శ్లాబ్ నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులు అధికారుల కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదు. మీరే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే, డబ్బులు నేరుగా మీ బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని ఆయన హామీ ఇచ్చారు. ఈ వినూత్న విధానం లబ్ధిదారులకు సమయం ఆదా చేయడమే కాక, నిధుల విడుదల పక్రియను వేగవంతం చేస్తుందని అంటున్నారు. ఇళ్ల నిర్మాణం విషయంలో కొన్ని మార్గదర్శకాలను కూడా మంత్రి వివరించారు. లబ్ధిదారులు కనీసం 400 చదరపు అడుగులు, గరిష్టంగా 600 చదరపు అడుగుల లోపు ఇంటిని నిర్మించుకోవాలి. ఇది లబ్ధిదారులకు సౌకర్యవంతమైన, సమర్థవంతమైన గృహాలను అందించడంలో సహాయపడుతుందని పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం పట్ల తన నిబద్ధతను మరోసారి చాటుకుంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లక్షలాది కుటుంబాలకు సొంత ఇల్లు అనే కలను సాకారం చేయడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి సర్కారు పనిచేస్తోంది. ఈ పథకం రాష్ట్రంలో గృహ నిర్మాణ రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తుందని, లబ్ధిదారుల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని అంతా ఆశిస్తున్నారు

# పింక్‌బుక్‌లో బెదిరింపు నేతల పేర్లు

## సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ కవిత ఘాటు వ్యాఖ్యలు



**ప్రజానావ, కామారెడ్డి :** ఎవరెవరు బెదిరిస్తున్నారో వాళ్ల పేర్లను బరాబర్ పింక్ బుక్కులో రాసుకుంటాం.. బెదిరింపులకు పాల్పడేవారిని ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టేదే లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్న కాంగ్రెస్ నాయకులపై ఎమ్మెల్సీ కవిత ఫైర్ అయ్యారు. బాన్సువాడలో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో కవిత పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లవద్దని కొంత మంది ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్లు తెలిసింది. కేసులు పెట్టించే పోలీస్ స్టేషన్లకు ఈడ్చిన వాళ్లను క్షమించే ప్రసక్తే లేదు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించే కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఎవరైనా ఊరుకునేదే లేదు. కాంగ్రెస్ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడేదే లేదు. వాళ్ల తాతలు, ముత్తాతలు, జేజమ్మలు ఎవరు దిగొచ్చినా కూడా భయపడేవాళ్లెవరూ లేరు ఇక్కడ అని ఎమ్మెల్సీ కవిత తేల్చిచెప్పారు. ఏడాదిన్నర పాలనలోనే ఇంత వ్యతిరేకత మూటగట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబుల్ ప్రైజ్ ఇవ్వాలని ఎద్దేవా చేశారు.

# కూలుస్తామంటే ఊరుకోం

## పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ హెచ్చరిక

**ప్రజానావ, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామంటే చూస్తూ ఊరుకోం అని.. ఇక్కడ ఎవరూ చేతులు కట్టుకుని కూర్చోలేదంటూ కాంగ్రెస్ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు హెచ్చరించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత అవినీతి చేసిందో.. ఎంత దోచుకుందో.. కాంట్రాక్టర్ల పేరుతో తెలంగాణ జనం సొమ్మును ఏ విధంగా లూటీ చేసిందో అనటానికి.. కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలే నిదర్శనం అంటూ దుమ్మెత్తిపోశారు. దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తోపాటు- మంత్రులు, ఎమ్మెల్యే స్పందించారు.



కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన బిల్డర్లు, పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వాన్ని పడగొట్టాలంటున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మంత్రులు, నేతలు కౌంటర్ ఇచ్చారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ స్పందిస్తూ.. చోటామోటా కాంట్రాక్టర్లు కూల్చితే కూలే ప్రభుత్వం కాదని, ఎమ్మెల్యేల సంపూర్ణ మద్దతు తనకు ఉందని చెప్పారు. చోటామోటా బ్యాచ్‌కి భయపడమని, బీఆర్ఎస్ పదేండ్లు యథేచ్ఛగా దోచుకుందని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ కు అమ్ముడు, కొనుగోలుపై అనుభవం ఉందని, ఎమ్మెల్యేలు సంతలో పశువులు కాదని పీసీసీ చీఫ్ కౌంటర్ ఇచ్చారు. ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ నేతలకు కనీస గౌరవం లేదని, డబ్బులకు అమ్ముడు పోయే ఎమ్మెల్యేలని బీఆర్ఎస్ అంటోందని, ప్రభుత్వ పెద్దలతో చర్చించి కొత్త ప్రభాకర్ వ్యాఖ్యలపై తగిన నిర్ణయం తీసుకుంటామని పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చెప్పారు.



# కేసీఆర్ ఆదేశాలతోనే కొత్త పలుకులు

## ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలో బిఆర్ఎస్ నేతలు
## ప్రభుత్వ మంచి పనులు జీర్ణించుకోలేని గులాబీనేతలు
## ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలపై పొంగులేటి ఆగ్రహం

**ప్రజానావ, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీకి, ఇందిరమ్మ ప్రభుత్వానికి ప్రజలు మద్దతిచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలని పలువురు కోరుతున్నారంటూ భారాస ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వారం నుంచే అధికార దాహంతో కూల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీలు, మతాలు, కులాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని పొంగులేటి తెలిపారు. అర్హులైన అందరికీ సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై ఇప్పటికే జీవోను విడుదల చేశామన్నారు. 'భూభారతి' వచ్చాక కొత్త ప్రభాకర్‌రెడ్డి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గతంలో అక్రమంగా భూములు కొల్లగొట్టారు. వాటిని భూభారతి ద్వారా ప్రభుత్వం తిరిగి తీసుకుంటుంది. అందుకే ఆయన భయాందోళనకు గురవుతున్నారు. కేసీఆర్ సూచన మేరకే ప్రభాకర్‌రెడ్డి ఆ వ్యాఖ్యలు చేశారు. 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవడాన్ని భారాస నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. భూభారతితో పేదల ఆస్తులను తిరిగి పేదలకు పంచుతాం. ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కూలుస్తామని పగటి కలలు కంటున్నారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి కేసీఆర్ ఆత్మ. ఈ ప్రభుత్వంపై మొదటి నుంచి కుట్రలు జరుగుతున్నాయి. వెంటనే సీఎం అయిపోవాలని తండ్రి, కుమారుడు చూస్తున్నారని పొంగులేటి వ్యాఖ్యానించారు. భారాస ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఖండించారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలనే యత్నాన్ని కుట్రకోణంగా భావిస్తున్నామన్నారు. ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలపై విచారణ జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరతామని చెప్పారు. కుట్రకోణం ఉన్నట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



# ప్రభుత్వాన్ని కూలుస్తామని ఎక్కడా అనలేదు

## ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తోందని చెప్పాం
## తామంతా కేసీఆర్ ఆత్మలమేనన్న కొత్త ప్రభాకర్ రెడ్డి

**ప్రజానావ, సిద్దిపేట:** రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూలుస్తామంటూ తాను ఎక్కడా చెప్పలేదని దుబ్బాక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత కొత్త ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయా వర్గాల వారు తమ దృష్టికి తెచ్చిన అంశాలను తమ కార్యకర్తల సమావేశం లో మాట్లాడుకున్నామని ఆయన వివరించారు. మంగళవారం సిద్దిపేటలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి..మీడియాతో మాట్లాడుతూ.. ఏడాదిన్నరగా అన్ని రంగాల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని.. దాని ఫలితమే ప్రభుత్వంపై ఈ అసంతృప్తి అని ఆయన అభివర్ణించారు. అయితే తాను బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆత్మనే.. తానే కాదు పార్టీలోని శ్రేణులంతా కేసీఆర్ ఆత్మేనని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లు ఉండాలని తమ పార్టీ అధినేత కేసిఆరే ఆకాంక్షించారన్నారు. ఎందుకంటే.. వారిపై వచ్చే వ్యతిరేకత మరో పదిహేను, ఇరవై ఏళ్ళ వరకు బిఆర్ఎస్ అధికారానికి ఉండడానికి ఎటువంటి ఢోకా ఉండదని తమ పార్టీ అధినేత కేసీఆర్ చెప్పారని వివరించారు. తమ బాస్ కాంగ్రెస్ పార్టీ నేతలను ఐదేళ్లు పాలించాలని కోరుకుంటే తాము మాత్రం కూలుస్తామని ఎందుకంటామని ఆయన ఎదురు ప్రశ్నించారు. గజ్వేల్ ఇంచార్జ్‌గా తాను ఏడేళ్లు ఉన్నాను.. దీంతో ఆ సమయంలో సీఎం కేసీఆర్ సహకారంతో ఎన్నో అభివృద్ధి పనులు చేసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో భూ అక్రమాలపై ఎలాంటి చర్యలకైనా తాను సిద్ధమని ఈ సందర్భంగా రేవంత్ ప్రభుత్వానికి ఆయన సవాల్ విసిరారు. ప్రభుత్వం మీది.. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రి పొంగులేటి సహా, అందరు మంత్రుల అవినీతిని వెలికితీయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మంచి చేస్తే అభినందిస్తాం.. కృతజ్ఞతలు చెబుతాం.. మాకు నిధులు ఇవ్వకుంటే మాత్రం నిలదీస్తామని ప్రభాకర్ రెడ్డి కుండ బద్దలు కొట్టారు. మల్లన్నసాగర్ నిర్మాణానికి త్యాగం చేసింది తమ దుబ్బాక నియోజకవర్గ ప్రజలని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. 14 గ్రామాలు నిండా మునిగాయని.. తమకు నెత్తిమీద నీళ్ళ కుండా ఉన్నా తాగు, సాగు నీళ్ళు మాత్రం రావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి కాలువలు తవ్వుకుని వేరే ప్రాంతాలకు, జిల్లాలకు నీరు తీసుకుంటుంటే తాము మాత్రం చేతులు ముడుచుకొని కూర్చుంటామా ? అని ప్రశ్నించారు. అభివృద్ధి నిధులు బడ్జెట్ సమయంలోనే ప్రతి నియోజకవర్గానికి కేటాయించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఇదే అంశాన్ని అసెంబ్లీలో తమ లాంటి ఎమ్మెల్యేలమంతా నిలదీస్తామని స్పష్టం చేశారు.

# ప్రభుత్వాన్ని కూల్చే దమ్ముందా! చూపండి..

## అధికారం లేకపోవడంతో కుయుక్తులు
## మాజీమంత్రి, సలహాదారు షబ్బీర్ వ్యాఖ్యలు

**ప్రజానావ, కామారెడ్డి:** రేవంత్ రెడ్డి సర్కార్‌ను కూల్చి వేస్తామంటూ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీమంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మండిపడ్డారు. అధికారం లేకపోయే సరికి బిఆర్ఎస్ నేతలు తట్టుకోలేక పోతున్నారని అన్నారు. కొత్త వ్ఆయఖ్యలపై మంగళవారం ఉదయం స్పందిస్తూ.. అధికార దాహంతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని విమర్శించారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి అంటే కేసీఆర్ బినామీ అని ఆరోపించారు. కేసీఆర్ మాటలనే కొత్త ప్రభాకర్‌రెడ్డి చెప్పారని పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌తో భూములను అక్రమంగా దోచుకుని.. వారి అనుయాయులకు కట్టబెట్టారంటూ బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. అక్రమంగా దోచుకున్న భూములను తమ ప్రభుత్వం.. వెనక్కి తీసుకుంటుందని బీఆర్ఎస్ నేతలు భయపడుతున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో అక్రమ సంపాదనతో లాభపడ్డ నేతలే తమ ప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తున్నారని



ఆరోపించారు. ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొనాలని వారు చూస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతల తాటాకు చప్పుళ్లకు తాము భయపడమని వారికి వార్నింగ్ ఇచ్చారు. తప్పు చేసిన వారికి సంకెళ్లు వేసి తీరుతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పినా వారి తీరు మారలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను ఎంతమందిని కొంటారో కొనాలంటూ వారికి సవాల్ విసిరారు. ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కూల్చి ఆ కుర్చీలో కూర్చోవాలని.. తండ్రీ, కొడుకులు పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వాన్ని ఎవరూ కూల్చలేరంటూ షబ్బీర్ స్పష్టం చేశారు. దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన బిల్డర్లు, పారిశ్రామి కవేత్తలు ప్రభుత్వాన్ని పడగొట్టాలంటున్నారని చెప్పుకొచ్చారు. అవసరమైతే ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని, ఆ ఖర్చును తాము భరిస్తామంటున్నారని హాట్ కామెంట్స్ చేశారు. పిల్లల నుంచి పెద్దల దాకా అందరూ కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారని, కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని కొత్త ప్రభాకర్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని జోస్యం చెప్పిన ఆయన.. రాజకీయాల్లోకి వచ్చాక సిన్సియర్‌గా ఉంటే కుదరడం లేదని.. దురుసుగా ఉంటే ఎలా ఉంటుందో చూపిస్తానని చెప్పారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
4 కరీంనగర్ బుధవారం 16 ఏప్రిల్ 2025

# నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ చార్జ్‌షీట్

## చార్జ్‌షీట్‌లో సోనియా, రాహుల్ పేర్లు

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కాంగ్రెస్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 :** 'నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటు-చేసుకుంది. ఈ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. ఇప్పటికే ఈ కేసుతో ముడిపడి ఉన్న ఆస్తుల స్వాధీనానికి నోటీసులు జారీ చేసిన ఈడీ అధికారులు.. తాజాగా కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దుబే పేర్లతో దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై ఏప్రిల్ 25న దిల్లీ ప్రత్యేక కోర్టు విచారణ చేపట్టనుంది. మరోవైపు, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేయడం ఇదే తొలిసారి. హరియాణాలో జరిగిన రియల్ ఎస్టేట్ ఒప్పందంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈ పరిణామం చోటు-చేసుకోవడం గమనార్హం. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఇటీ-వల ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా నోటీసులు జారీ చేసింది. తాజాగా దిల్లీ ప్రత్యేక కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ.. తదుపరి విచారణను కొనసాగిస్తున్నట్లు- తెలిపింది. నేషనల్ హెరాల్డ్ ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడమనేది చట్టబద్ధమైన పాలన ముసుగులో ప్రభుత్వ ప్రాయోజిత నేరంగా కాంగ్రెస్ పేర్కొంది. తమ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఇతర నేతలపై ఛార్జిషీట్ దాఖలు చేయడం.. ప్రధాని, హోంమంత్రి ప్రతీకార రాజకీయాలు, బెదిరింపులకు పాల్పడటం తప్ప మరొకటి కాదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మండిపడ్డారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ, నాయకత్వం మౌనంగా ఉండబోవన్న ఆయన.. 'సత్యమేవ జయతే' అని 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. కాంగ్రెస్ అగ్రనేతల పేర్లతో ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేయడంపై ఆ పార్టీ ఎంపీ అఖిలేశ్ ప్రసాద్ సింగ్ స్పందించారు. ప్రతీకారంతో, విపక్ష నేతలను ఉచ్చులో పడేసేందుకు భాజపా ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కానీ, ఇలాంటి చర్యలకు కాంగ్రెస్ భయపడదన్నారు.

## సంపాదకీయం



# రష్యా బాటలోనే.. ట్రంప్ యుద్ధం!

ఉక్రెయిన్ యుద్ధం ఇంకా ముగియనే లేదు.. ట్రంప్ రూపంలో మరో యుద్ధం మొదలయ్యింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడులతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ఇది ఇంకా కొనసాగుతుండగానే గాజాపై ఇజ్రాయిల్ దాడులు కూడా ప్రభావం చూపాయి. ఇలా అంతర్జాతీయంగా జరుగుతున్న దాడుల కారణంగా ప్రపంచ మార్కెట్లు కుదుపునకు గురవుతున్నాయి. తాజాగా ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాగానే మరో రకమైన యుద్ధానికి తెరతీసారు. సుంకాలతో ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థపై దాడి మొదలు పెట్టారు. ఇది తమకూ వర్తిస్తుందని గుర్తించడం లేదు. అందుకే చైనా ధీటుగానే స్పందిస్తోంది. కొన్ని వస్తువులపై అమెరికాకు పోటీగా సుంకాలు విధించడంతో పాటు, మరికొన్న వస్తువులను అమెరికాకు సరఫరా చేయడం ఆపేసింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడితో ఒక్క ఉక్రెయినే కాకుండా రష్యా కూడా కోలుకోలేని విధంగా దెబ్బతింది. అంతేగాకుండా యుద్దానికి దిగితే విరమించుకోవడం అంత ఈజీ కాదని తెలిసి వచ్చింది. ఈవ్యవహారం సమసిపోక ముందే ఇప్పుడు ట్రంప్ తీరుతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక విధాలుగా ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. అంతకుమించి అమెరికాలో కూడా ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతు న్నారు. రోడ్డెక్కి ధర్నలు చేస్తున్నారు. ట్రంప్ విధానాలను తూర్పారా బడుతున్నారు. అయినా ట్రంప్‌లో ఏ మాత్రం పశ్చాత్తాపం కనిపించడం లేదు. ప్రపంచ దేశాలు అన్నిటినీ ట్రంప్ వచ్చీరాగానే ఆందోళనలో పడేశాడు. అమెరికాలో చదువుకుంటున్న వారిని, అక్కడికి వెళ్లి ఉంటున్న వారిలో సైతం కంటిమీద కునుకు లేకుండా చేశాడు. ప్రపంచ దేశాల ప్రజలు ట్రంప్ చర్యలు చూసి నవ్వుకుంటున్నారు. సకల దేశాలపై విధించిన సుంకాల వివరాలను ట్రంప్ ప్రకటించారు. కొన్ని దేశాల విషయంలో మాత్రం కొంత ఉదారతను చూపారు. నిరుద్యోగం భారీగా పెరగడం, ద్రవ్యోల్బణం కట్టడి చేయడం లక్ష్యంగా సమస్యలను తొలగిం చేందుకు ట్రంప్ సంకల్పించారు. అమెరికా మహా సంపన్న దేశం. మహాశక్తిమంతమైన దేశం. వైజ్ఞానిక, సాంకేతిక నవకల్పనలు అన్నీ ఆ దేశ ప్రతిభా ఫలాలే. ప్రపంచ అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, ప్రయోగ శాలలు, ఉత్కృష్ట కంపెనీలు అమెరికా లోనే ఉన్నాయి. అమెరికా డాలర్ రిజర్వ్ కరెన్సీగా ప్రపంచ దేశాల ఆమోదం పొందింది. అమెరికా గ్రీన్ కార్డ్, అమెరికా పాస్‌పోర్ట్ ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మందిని ఆకర్శిస్తోంది. ఉద్యోగం దొరికితే చాలు అక్కడే స్థిరపడి పోవాలనుకునే భారతీయులు ఎందరో. చైనా, ఇండియాతో సహా అనేక దేశాలు తమ విదేశ మారక ద్రవ్య నిల్వలలో అత్యధిక భాగాన్ని అమెరికా బాండ్ల రూపంలో భద్రపరచుకుంటున్నాయి. ప్రపంచంలో ద్రవ్యలోటు లేని ఏకైక దేశం అమెరికాయే గనుక ఆ దేశ బాండ్లు తమకు ఆర్థిక భద్రత సమకూరుస్తాయని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. దురదృష్ట వశాత్తే తమకు ఎలాంటి లబ్ధిని సమకూర్చడం లేదని ట్రంప్‌ను గెలిపించిన అమెరికా ప్రజలు భావిస్తున్నారు. ఆయన ఏ ఉద్దేశ్యంతో ఈ సుంకాల యుద్ధం మొదలు పెట్టారో కానీ...అమెరికా అధ్యక్షుడుగా రెండోసారి గెలిచిన తరువాత డోనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు, చర్యలు సంచలనం కలిగిస్తున్నాయి. వాటి పర్యవసానాలు సుదీర్ఘకాలం ప్రపంచాన్ని, ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయనున్నాయి. దేశదేశాల నుంచి ప్రతిభావంతుల వలసలు అమెరికాకు నిలిచిపోతాయన్న ఆందోళనలను ట్రంప్ పట్టించుకోవడం లేదు. సరుకుల వాణిజ్యానికి గణనీయమైన విఘాతం కలుగుతుంది. సరఫరా చైన్ ఒడిదుడుకులు ఎదుర్కొంటుంది. ట్రంప్ విధానాల పర్యవసానాలను ఎదు-ర్కోవడంలో చాలా సంపన్న దేశాలు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. ట్రంప్ ఏవో భ్రమలతో దబాయిస్తున్నారని అందరికీ అర్థమవుతుంది. అమెరికాలోకి దిగుమతి అవుతున్న సరుకులపై భారీ సుంకాలతో సంభవించే ధరల పెరుగుదలను అమెరికా ప్రజలు భరించలేరు. ద్రవ్యోల్బణం పెచ్చరిల్లుతుంది. లక్షలాది ప్రజలు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదమున్నది. ట్రంప్ చర్యల కారణంగా అక్కడ ప్రస్తుతం నిత్యావసర వస్తువులు ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితులను అమెరికా ప్రజలు సహించరు. అమెరికా ఫస్ట్ నినాదాన్ని స్వాగతిస్తూనే ట్రంప్ తీరును ఎండగడుతున్నారు. అమెరికన్లు కూడా ద్రవ్యోల్బణం తాకిడికి తీవ్రంగా గురవుతారు. ఇప్పటికే అమెరికా వ్యాప్తంగా అన్ని పెద్ద నగరాలలోను వేలాదిగా ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత పెరిగినప్పుడు ఈ ఆందోళనలు మరింత తీవ్రం కాక తప్పవు. అమెరికా ప్రజల ఆగ్రహావేశాలకు ట్రంప్ ఎలా ప్రతిస్పందిస్తారన్నది తెలియాల్సి ఉంది. అనవసరంగా తేనెతుట్టెను కదిపిన ట్రంప్, తనకూ పుతిన్‌కు పెద్దగా తేడా లేదని నిరూపించుకున్నారు. ఆధునిక యుద్ధాలు ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తాయని అనుభవంలోకి వచ్చింది. అమెరికా బాండ్లపై వడ్డీ రేట్ల తీరుతెన్నులను ఆయన తప్పక పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ట్రంప్ సుంకాల దెబ్బను కొన్ని దేశాలు తీవ్రంగానే ప్రతిఘటిస్తున్నాయి. స్పందిస్తున్నాయి. ప్రతీకార సుంకాలను చైనా విధించింది. నీ బెదిరంపులను పట్టుకోబోమని తేల్చింది. కెనడా, యూరోప్ గట్టిగా ప్రతిఘటిస్తున్నాయి. సుంకాల సమరాన్ని అమెరికా అనివార్యం చేస్తే, చైనా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు. రాజీ లేని పోరుకు బీజింగ్ సమాయత్తమై ఉన్నది. ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధంపై భారత్ ఆచితూచి అడుగేస్తోంది. మోదీ ప్రభుత్వం ఈ విషయమై జాగరూకతతో వ్యవహరించడం కూడా ముఖ్యమే. ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలను 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్టు ట్రంప్ ప్రకటించడంతో అందరూ సంతోషిస్తున్నారు. ఈ యుద్ధ విరామంతో, ఆయనను ఆర్థిక వివేకం కలిగి ఆలోచన చేస్తే ఆయనతో పాటు..ప్రపంచ దేశాలకు కూడా మంచిదే. కానీ ఇలాగే సుంకాల యుద్ధం కొనసాగిస్తే...దానికి ఫలితం కూడా అనుభవించక తప్పదు. ట్రంప్ విధానాలతో ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి వెడుతోందని ఆర్థికవేత్తలు చాలా మంది గట్టిగా అభిప్రాయపడుతున్నారు. ఆర్థిక మాంద్యం ముంచుకు వస్తోందని కూడా పలువురు ఘంటాపథంగా చెబుతున్నారు.

# విస్తారంగా వర్షాలు

## వాతావరణ శాఖ తీపి కబురు



**న్యూఢిల్లీ, ఏప్రిల్15 :** దేశ రైతులు, ప్రజలకు భారత వాతావరణ శాఖ తీపికబురు చెప్పింది. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తాయని తెలిపింది. నైరుతి రుతుపవనాల సీజన్‌లో వర్షాలు విస్తారంగా కురుస్తాయని చెప్పింది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణం కంటే ఎక్కువగానే వర్షాపాతం నమోదవుతుందని మంగళవారం అంచనా వేసింది. మొత్తం సీజన్‌లో ఎల్ నినో పరిస్థితుల అవకాశాన్ని తోసి పుచ్చింది. నాలుగు నెలల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. మొత్తం దీర్ఘకాల సగటు- వర్షాపాతం 105శాతంగా ఉంటుందని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ మోహపాత్ర వెల్లడించారు. న్యూఢిల్లీలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. దేశంలో 1971-2020 మధ్యకాలంలో దీర్ఘకాల సగటు- 87 సెంటీమీటర్లు మాత్రమే ఉండాదని పేర్కొన్నారు. భారత ఉపఖండంలో సాధారణం కంటే తక్కువ వర్షాపాతంతో సంబంధం ఉన్న ఎల్ నినో పరిస్థితులు ఈ సారి అభివృద్ధి చెందే అవకాశం లేదన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్నాటకలోనూ సాధారణం కంటే ఎక్కువగానే ఉంటాయని చెప్పింది. వాతావరణ శాఖ ఇచ్చిన అప్‌డేట్ దేశ రైతులకు ఎంతో ఉపశమనం కలిగించనున్నది. నైరుతి రుతుపవనాలు భారత దేశ వ్యవసాయరంగానికి ఎంతో కీలకమైనవి. వ్యవసాయం దేశ జనాభాలో దాదాపు 42.3 శాతం మందికి జీవనోపాధి అందిస్తున్నది. అదే సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థకు 18.2శాతం దోహదపడుతున్నది. ఇటీ-వల కాలంలో వర్షం కురిసే రోజులు తగ్గుతుండగా.. స్వల్ప వ్యవధిలో భారీ వర్షాలు పెరుగుతోంది. దాంతో తరచూ కరువులు, వరదలు సంభవిస్తున్నాయని వాతావం-ణశాఖ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. దేశంలోని కొన్ని ప్రాంతాలు ఇప్పటికే తీవ్రమైన వేడితో అల్లాడుతున్నాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు గణనీయంగా ఎక్కువ సంఖ్యలో వేడిగాలులు వీచే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగా వైవిధ్యం మరింత పెరిగిందని పేర్కొంటు-న్నారు.



# వేసవి దాహార్తి కోసం చలివేంద్రాలు

## మంత్రి సీతక్క ఆదేశాలతో పలు చోట్ల ఏర్పాటు

**ప్రజానావ, హైదరాబాద్:** వేసవి దాహాన్ని తీర్చేందుకు పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామాలు, మండల కేంద్రాల్లో భారీ సంఖ్యలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 8,090 చలివేంద్రాలు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. వేసవి కాలంలో పనుల నిమిత్తం బయటకు వచ్చే ప్రజలకు తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఈ చర్యలు చేపట్టబడ్డాయి. మంత్రి సీతక్క స్పష్టమైన ఆదేశాలతో పీఆర్‌ఆర్‌డీ అధికారులు గ్రామాల నుంచీ రద్దీ ప్రాంతాల వరకు ప్రతి చోట చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలు విరివిగా ఈ సేవలను వినియోగించుకుంటుండగా, మంత్రి సీతక్క విస్తృతంగా చలివేంద్రాల ఏర్పాటుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే, కృషి చేస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా పీఆర్‌ఆర్‌డీ శాఖ ముందస్తుగా చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలోని 31 జిల్లాల కలెక్టర్లకు ఒక్కో జిల్లాకు రూ. కోటి చొప్పున పీఆర్‌ఆర్‌డీ సొంత నిధుల నుండి ప్రత్యేక నిధులు కేటాయించబడ్డాయి. ఈ నిధులను అత్యవసర తాగునీటి అవసరాల కోసం ఖర్చు చేయాలని, మిషన్ భగీరథ నుండి నీరు అందని సందర్భాల్లో ప్రజలకు సమస్యలు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో ఫైనాన్స్ శాఖ నుండి ప్రత్యేక నిధుల మంజూరుపై అనుమతులు ఇచ్చినప్పటికీ, వాస్తవంగా నిధుల విడుదల జరగలేదని అధికారులు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం పీఆర్‌ఆర్‌డీ సొంత నిధుల ఆధారంగా తక్షణ అవసరాలను తీర్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ వేసవిలో గ్రామీణ ప్రజలకు తాగునీటిలో ఇబ్బందులు లేకుండా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పీఆర్‌ఆర్‌డీ స్పష్టం చేసింది.

# ఢిల్లీ కాలుష్యానికి చెక్ పెట్టాల్సిందే

## ప్రత్యామ్నాయ ఇంధన వనరులు వాడాలి

## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** దేశ రాజధానిలో వాతావరణ కాలుష్యం తీవ్రస్థాయిలో ఉండటంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యంగా శిలాజ ఇంధనాలు తగ్గించాలని, ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రజలు మళ్లాలలని ఆయన సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ కాలుష్యానికి చెక్ పెట్టేందుకు ప్రజలు కూడా బాధ్యతగా ముందుకు రావాలన్నారు. పెట్రోల్, డీజిల్ కాలుష్యానికి ప్రధాన కారణాలు కాబట్టి వాహనాల్లో ఉపయోగించే ఇంధనంలో మార్పు అవసరమన్నారు. మనం దాదాపు రూ.22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాలను దిగుమతి చేసుకుంటు-న్నామని.. వాటికి ప్రత్యామ్నాయ ఇంధనాలు వినియోగించాల్సిన సమయం వచ్చిందన్నారు. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకోవాలనే లక్ష్యంతో ముందుకువెళు_న్న భారత్ రవాణా, విద్యుత్, నీరు, కమ్యూనికేషన్ రంగాలలో ప్రపంచస్థాయి సదుపాయాలను కల్పించడంపై దృష్టిపెడుతోందన్నారు. దిల్లీలో మూడ్రోజులు ఉంటే జబ్బు చేయడం ఖాయమని అన్నారు. కాలుష్యం విషయంలో దిల్లీ, ముంబయి రెడ్‌జోన్‌లో ఉన్నాయని తెలిపారు. దిల్లీలో పరిస్థితి ఇలాగే కొనసాగితే అక్కడి ప్రజల ఆయుర్దాయం 10 ఏళ్లకు తగ్గుతుందని.. వైద్య పరిశోధనను ఉటంకిస్తూ పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని సూచించారు. రాష్ట్రాలలో మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక వ్యవస్థకు ఏవిధంగా ప్రాధాన్యం ఇస్తామో అలాగే పర్యావరణాన్ని కూడా ముఖ్యమైన విషయాల్లో ఒకటిగా పరిగణించాలన్నారు. కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి రహదారుల మౌలిక సదుపాయాల కల్పన కూడా ఓ పరిష్కారంగా పని చేస్తుందని గడ్కరీ పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాల లాజిస్టిక్ ఖర్చులు 12 శాతం లోపు ఉంటే మన ఖర్చులు 16శాతం వరకు ఉన్నాయని.. 2026 చివరి నాటికి వాటిని సింగిల్ డిజిట్‌కు తగ్గించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా స్విస్ ఎయిర్ క్వాలిటీ టెక్నాలజీ కంపెనీ ఐక్యూ ఎయిర్ కాలుష్యంపై రూపొందించిన 'ద వరల్డ్ ఎయిర్ క్వాలిటీ- రిపోర్ట్ 2024' నివేదిక ఇటీవల విడుదలైంది. దీని ప్రకారం.. ప్రపంచంలో అత్యధికంగా కాలుష్యం వెలువడే 20 నగరాల్లో 13 భారత్‌లోనే ఉన్నాయి. అస్సాంలోని బైర్నీహాట్ నగరం తొలిస్థానంలో నిలవగా.. తరువాతి స్థానాల్లో దిల్లీ, ఇతర నగరాలు ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత కాలుష్యపూరిత రాజధానిగా దిల్లీ తొలి స్థానంలో కొనసాగుతున్నట్లు ఈ నివేదిక తెలిపింది. ఈ కాలుష్యం వల్ల అక్కడి ప్రజల ఆయుర్దాయం దాదాపు 5.2 సంవత్సరాలు తగ్గినట్లు అంచనా వేసింది. 2009 నుంచి 2019 వరకు భారత్‌లో ప్రతి ఏడాది కాలుష్య సంబంధిత వ్యాధుల వల్ల దాదాపు 1.5 మిలియన్ల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నట్లు- గతేడాది విడుదలైన లాన్సెట్ ఎ÷-లానెటరీ హెల్త్ అధ్యయనం పేర్కొంది. దీని ఆధారంగా గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై ఆధారపడాల్సి ఉందన్నారు.

# 17లోగా ఇండ్లు కేటాయించాలి



**21లోపు కమిటీల నుంచి జాబితా సేకరించాలి**

- 22 నుంచి 30 దాకా దరఖాస్తుల పరిశీలన
- నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**ప్రజానావ, సిరిసిల్ల:** ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపికకు కట్టుదిట్టమైన కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఇందిరమ్మ ఇండ్ల పథకం పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి పొరపాట్లు ఉండటానికి వీలు లేదని, మనకు వచ్చిన దరఖాస్తులలో అత్యంత నిరుపేదలకు మాత్రమే మొదటి విడతలో ఇండ్లు మంజూరు చేయాలని, మన జిల్లాలో రెండు నియోజకవర్గాలకు కలిపి మొత్తం 7000 ఇండ్లు మొదటి విడతలో నిర్మిస్తున్నామని కలెక్టర్ సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు పై పలు సూచనలు చేశారని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రభుత్వం మంజూరు చేసిన 3,500 ఇండ్లలో పైలెట్ ప్రాజెక్టు కింద మండలాలు ఎంపిక చేసిన గ్రామాలలో కొన్ని ఇండ్లు మంజూరు చేశామని, మిగిలిన ఇండ్లను గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారీగా మంజూరు చేసేందుకు అలాట్మెంట్ తయారు చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు అర్హత ఉండి ఇంటి స్థలం ఉన్న దరఖాస్తుల సంఖ్య ప్రాతిపదికగా సదరు గ్రామాలకు, వార్డులకు ఇండ్ల కేటాయింపు ఏప్రిల్ 17 లోగా పూర్తి చేయాలని అన్నారు. అనంతరం గ్రామాలు, వార్డులలో ఇందిరమ్మ కమిటీలతో సమావేశం నిర్వహించి, అర్హుల జాబితాలో నుంచి మొదటి విడత మంజూరు చేసేందుకు గ్రామానికి అలాట్మెంట్ చేసిన ఇండ్ల సంఖ్యకు లబ్ధిదారుల ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. ఏప్రిల్ 21 లోపు ఇందిరమ్మ కమిటీల నుంచి ప్రతి గ్రామానికి/ వార్డుకు అలాట్ చేసిన ఇందిరమ్మ ఇండ్ల కు లబ్ధిదారుల జాబితా వివరాలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో ఎక్కడైనా ఇందిరమ్మ కమిటీల నుంచి సమాచారం రాకపోతే సంబంధిత ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ఎంపీడీఓ లకు సూచించారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన ప్రతి 200 ఇండ్ల లబ్ధిదారులకు ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి బృందంగా ఏర్పడి ఏప్రిల్ 22 నుంచి ఏప్రిల్ 30 వరకు మరో సారి ఫీల్డ్ వెరిఫికేషన్ చేయాలని, ఎవరైనా అనర్హులు ఉంటే జాబితా నుంచి తొలగించాలని అన్నారు. మే 2,2025 న ప్రతి గ్రామంలో అర్హుల జాబితా అతికిస్తామని, జిల్లా ఇంఛార్జి మంత్రి వర్యుల తుది ఆమోదంతో మే 5 తరువాత ఇందిరమ్మ ఇండ్లు మంజూరి పత్రాలు పంపిణీ మండల కేంద్రాలకు అందించడం జరుగుతుందని అన్నారు. మండలాల వారిగా స్థానిక ప్రజాప్రతినిధుల సమయం తీసుకుని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీకి ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ కమిటీ లో నుంచి జాబితా తెచ్చుకునే అంశంలో అధికారులు, ఆర్డిఓ ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారులకు నాలుగు దశలలో సహాయం అందుతుందని, బేస్మెంట్ పూర్తయితే 1లక్ష రూపాయలు, లెంటల్ లెవెల్ పూర్తయితే 1లక్ష , స్లాబ్ నిర్మాణం జరిగినప్పుడు 2 లక్షలు, ఇంటి నిర్మాణం మొత్తం పూర్తయిన తర్వాత 1 లక్ష చొప్పున మొత్తం 5 లక్షల రూపాయల ప్రభుత్వం నుంచి విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. మన జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాలలో 1023 ఇండ్లు మంజూరు చేశామని, వీటిలో 282 ఇండ్లు మాత్రమే ఇప్పటివరకు మార్క్ చేయడం జరిగిందని, పెండింగ్ లబ్ధిదారులతో చర్చించి ఇండ్ల నిర్మాణం త్వరగా ప్రారంభించేలా చూడాలని, ముందస్తుగా నిధులు ఇబ్బందులు ఉన్నవారికి స్వశక్తి మహిళా సంఘాల ద్వారా రుణం అందించి పనులు ప్రారంభించాలని అన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారి రాధా భాయి, పిడి. హౌసింగ్ శంకర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి , జడ్పీ సీఈఓ వినోద్ కుమార్, మండల ప్రత్యేక అధికారులు ఎంపిడిఓలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇన్ఫర్మేషన్ వ్యవస్థను మెరుగుపర్చుకోవాలి

- జిల్లా ఎస్పీ మహేష్ బి గితే



**ప్రజానావ, సిరిసిల్ల :** గ్రామాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది పర్యటిస్తూ ఇన్ఫర్మేషన్ వ్యవస్థను మెరుగుపరుచుకోవాలని సిరిసిల్ల ఎస్పీ మహేష్‌బి గితే అన్నారు. మంగళవారం గంభీరావుపేట్, ముస్తాబద్ పోలీస్ స్టేషన్లు,నర్మల డ్యాంను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా పోలీస్ స్టేషన్ల ఆవరణలో 5ఎస్ అమలు తీరు,విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్ని విభాగాలు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో పెండింగ్లో ఉన్న కేసులు, నమోదు అవుతున్న కేసుల వివరాలు,శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకొని,పెండింగ్లో ఉన్న కేసులపై రివ్యూ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీస్ విధులు ఉండాలని,పోలీస్ అధికారులు, సిబ్బంది స్టేషన్ పరిధిలోని గ్రామాలు,వార్డులు పర్యటిస్తూ ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేయాలని అధికారులకు సూచించారు. డయల్ 100 కాల్స్‌కి వెంటనే స్పందించి బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది, అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సమస్యలు పరిష్కరించాలని,పెట్రోలింగ్ సమయంలో స్టేషన్ పరిధిలోని చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని,రౌడి షీటర్స్,హిస్టరీ షీటర్స్,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా కఠినతరం చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు అయిన గంజాయి,అక్రమ ఇసుక రవాణా, పిడియాస్ రైస్ అక్రమ రవాణా పై ఉక్కుపాదం మోపాలన్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై నిఘా పటిష్టం చేస్తూ గంజాయి నివారణకు పకడ్బందీగా చర్యలు చెపడుతు,గంజాయి వలన కలుగు అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు శ్రీనివాస్,మెంగిలి, ఎస్.ఐ ప్రేమనందం,సిబ్బంది ఉన్నారు.

# హత్య కేసులో నలుగురికి రిమాండ్




**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ పట్టణంలో సంచలనం సృష్టించిన ట్రాక్టర్ డ్రైవర్ చెట్టుపల్లి పరుశరాములు హత్య కేసును వేములవాడ పోలీసులు ఛేదించారు. ఈ మేరకు మంగళవారం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి వివరాలు వెల్లడించారు. మృతుడు పరుశరాములు, బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి,వస్తాద్ అఖిల్, నేదురి రాజేష్, అడ్డ గట్ల మనోజ్ కుమార్ అనువారు గతంలో కలిసి తిరిగే వారు. వీరందరిపై గంజాయి కేసులు, హత్య కేసులతో పాటు ఆయా పోలీస్ స్టేషన్ లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదవ్వగా చాలాసార్లు జైలుకు వెళ్లి వచ్చారు. గత కొంతకాలంగా మృతుడైన పరుశురాములు మిగతా ఐదుగురితో ఉండకుండా తన పని తాను చేసుకుంటూ ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలోనే కొద్ది రోజుల క్రితం ఐదుగురు నిందితుల పైన వివిధ పోలీస్ స్టేషన్లలో గంజాయి కేసులు నమోదయ్యాయి. ఈ కేసులవ్వడానికి మృతుడైన పరుశురాములే కారణమని, తాము చేస్తున్న పనుల పట్ల పోలీసులకు సమాచారం ఇస్తున్నాడనే అనుమానంతో ఎలాగైనా పరశురాములను చంపితేనే తమపై గంజాయి కేసులు కావని, తాము సులువుగా గంజాయి వ్యాపారం చేయవచ్చునని, ఇలా చేస్తే ఇక పోలీసులకు దొరకమని, అలా వచ్చిన డబ్బులతో జల్సాలు చేయవచ్చునని భావించి ఐదుగురు నిందితులు ఈనెల 13వ తేదీనా ముందస్తు పథకం ప్రకారం మృతుడు పరుశరాములును వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డులో ఉన్న మహా లింగేశ్వర ఫంక్షన్ హాల్ స్టోర్ రూమ్ బిల్డింగ్ పైన ఒంటరిగా ఉండడం చూసి ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో తమ వెంట తెచ్చుకున్న గొడ్డల్లు, కత్తితో ముగ్గురు నిందితులైనా బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్ లు మృతున్ని విచక్షణారహితంగా దాడి చేసి చంపగా, మరో నిందితుడు రాజేష్ బయట నుంచి ఎవరు రాకుండా గేటు వేశాడు. మరో నిందితుడైన అడ్డ గట్ల మనోజ్ కుమార్ వీరందరూ జైలుకు వెళితే బెయిల్ తీసుకురావడానికి తాను బయట ఉంటానని చెప్పి వీరందరినీ హత్య చేయడానికి పంపించాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేములవాడ పట్టణ సీఐ వీర ప్రసాద్ కేసు నమోదు చేసుకొని గాలింపు చేపట్టగా మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో అయ్యోరు పల్లి గ్రామ శివారులో నిందితులను పట్టుకుని పంచనామా నిర్వహించి నిందితుల నుంచి హత్యకు వినియోగించిన రెండు గొడ్డళ్ళు, ఒక కత్తి, 2 బైకులు, 2 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్ కు తరలించామని, పరారీలో ఉన్న మిగతా నిందితుడు మనోజ్ కొరకు గాలిస్తున్నట్లు ఏ.ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్సైలు వెంకట్రాజం, రమేష్, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన




**ప్రజానావ, వేములవాడ:** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అగ్నిమాపక సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను అగ్నిమాపక అధికారి అనిల్ తెలియజేశారు. ఫాంప్లెట్లు పంచి, అగ్ని ప్రమాద, నివారణ, నియంత్రణ చర్యల గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం, ఉపాధ్యాయులు మల్లేశం, రవీందర్, కోటేశ్వర్, సలాం, బాలకృష్ణ, హమీద్, శ్రీలత, స్వరూప అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## వేములవాడలో రోడ్డు ప్రమాదం



**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ పట్టణంలోని వాసుదేవ టవర్ వద్ద మంగళవారం రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. అతి వేగంగా వచ్చిన స్విఫ్ట్ డిజైర్ కారు ఇన్నోవా వాహనాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. కారు అక్కడ నిలిపి ఉన్న పలు వాహనాలపైకి దూసుకెళ్లడంతో పలు వాహనాలు ధ్వంసమైయ్యాయి. కాగా, స్విఫ్ట్ డిజైర్ కారులో అటవీశాఖ రేంజ్ అధికారి ఖలీలోద్దిన్, సెక్షన్ అధికారి పల్లె శ్రీనివాస్ లు ప్రయాణం చేస్తున్నారు. శ్రీనివాస్ వాహనాన్ని నడుపుతూ ఇన్నోవాను ఢీకొట్టడంతో రెండు కార్లు ధ్వంసం కాగా, అటవీ శాఖ అధికారులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. రోడ్డు ప్రమాదంతో ట్రాఫిక్‌కు స్వల్ప అంతరాయం ఏర్పడింది.

## రోడ్డు ప్రమాదంలో గీత కార్మికుడు మృతి



**ప్రజానావ, సిరిసిల్ల:** వేములవాడ అర్బన్ మండలం అనుపురం వద్ద బైక్ ను కారు ఢీకొట్టడంతో అనుపురం గ్రామానికి చెందిన బండారి శ్రీహరి(48) అనే గీత కార్మికుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మంగళవారం కల్లు గీసుకొని ఇంటికి వెళ్లేందుకు శ్రీహరి ప్రధాన రోడ్ దాటుతుండగా, కరీంనగర్ నుంచి వస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. శ్రీహరి తీవ్రంగా గాయపడి అక్కడిదక్కడే మృతి చెందాడు. డ్రైవర్‌కారు వదిలి పరారయ్యాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నాసా ప్రాజెక్ట్ విజేతలకు బెల్లంపల్లి జడ్జి ప్రశంసలు



**ప్రజానావ, బెల్లంపల్లి:** నాసా ఎన్ఎస్ఎస్ వారు ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రాజెక్ట్స్ లో బెల్లంపల్లి శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు చేసిన ప్రాజెక్ట్‌కు ఉత్తమ బహుమతి రాగా, మంగళవారం విద్యార్థులను బెల్లంపల్లి కోర్టు జడ్జి జే ముఖేష్ అభినందించారు. ఇటువంటి పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఏజీఎం అరవింద్ రెడ్డి, ప్రిన్సిపాల్ సంజీవ్, తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ జయరాజ్, మంచిర్యాల సమన్వయకర్త నాగరాజు, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

6 | కరీంనగర్ | బుధవారం 16 ఏప్రిల్ 2025



# యువ వికాసం యూనిట్ల గ్రౌండింగ్‌కు బ్యాంకర్లు సహకరించాలి

- ఏప్రిల్ 29 వరకు రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**ప్రజానావ, సిరిసిల్ల:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం క్రింద నిరుద్యోగ యువతీ యువకులతో వివిధ వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్ కు బ్యాంకర్లు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ పేర్కొన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ , రాజీవ్ యువ వికాసం పై మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు , బ్యాంకర్లతో వీసి ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశ పెట్టిందని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో బ్యాంక్ బ్రాంచీల వారిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ యూనిట్ల లక్ష్యాలను కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 50 వేల రూపాయల వరకు 100% సబ్సిడీ, లక్ష రూపాయల వరకు 90% సబ్సిడీ, 2 లక్షల వరకు 80% సబ్సిడీ, 4 లక్షల వరకు 70% సబ్సిడీ తో యూనిట్ల ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఏప్రిల్ 14 వరకు వచ్చిన రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను మండలాల వారిగా, మున్సిపాలిటీలలో ప్రత్యేక బృందాలను బ్యాంకర్లతో కలిసి ఏర్పాటు చేసి స్క్రూటిని చేయాలని , అర్హుల జాబితాను ఎంపిక చేసి జిల్లాకు పంపాలని అన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు ఆమోదంతో తుది జాబితా రూపొందించడం జరుగుతుందని అన్నారు. ఏప్రిల్ 29 వరకు మండలం స్థాయిలో విచారణ పూర్తి చేసి లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని అన్నారు. 50 వేల రూపాయల వరకు యూనిట్ ఉండే లబ్ధిదారులకు 100% సబ్సిడీ తో ఎటువంటి బ్యాంకులు లేకుండా యూనిట్ గ్రౌండ్ చేయాలని అన్నారు. రాజీవ్ యువ వికాసం సంబంధించి అందించిన సర్టిఫికెట్లు సరిగా ఉన్నాయో లేవో తహసిల్దార్ పరిశీలించాలని, అభ్యర్థి దరఖాస్తు చేసుకున్న యూనిట్, లాభసాటిగా నడిపెందుకు గల అవకాశాలు వంటి అంశాలను ఎంపిడిఓ పరిశీలించాలని అన్నారు. నిరుద్యోగ యువత యువకులు ఆత్మగౌరవంతో జీవించేలా ఈ పథకాన్ని రూపొందించామని అన్నారు. బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారులు యువకులకు అవసరమైన గైడెన్స్ అందించాలని కలెక్టర్ తెలిపారు. మనకు అందుబాటులో ఉన్న 15 రోజుల సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మండలాల వారిగా బ్యాంకారులకు కేటాయించిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ యూనిట్ లక్ష్యాల వివరాలను తెలియజేస్తూ, వాటి సాధనకు అనుసరించాల్సిన పద్ధతుల పై పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్, మండల ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్సై



**ప్రజానావ, బెజ్జూర్ :** మండల కేంద్రంలో మంగళవారం ఎస్సై కొట్టి ప్రవీణ్ చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం పెరుగుతున్న ఎండల దృష్ట్యా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సీఐ ముత్యం రమేష్ పర్యవేక్షణలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా చలివేంద్రం ప్రారంభించినట్లు చెప్పారు. చలివేంద్రాన్ని మండల ప్రజలు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్ కుమార్ పోలీసులు గ్రామస్తులు ఉన్నారు.

## బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి




**ప్రజానావ, నేరడిగొండ :** బాలికలు ముందస్తు భవిష్యత్తులో చదువు తోపాటు అన్ని రంగాల్లో రాణించాలని సైంటిస్ట్ సీఈ, డాక్టర్ స్వప్న అన్నారు. పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం హైదరాబాద్ నుంచి డీఎల్ ఇన్ కేమిస్ట్రీ సుష్మతో కలసి ఆమె మండలంలోని లఖంపూర్ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మహిళా సాధారికత, భవిష్యత్తులో ఉన్నత చదువులు, అన్ని రంగాల్లో ఎలా రాణించాలానే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం వారిని సన్మానించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అశోక్, వార్డెన్ స్వప్న, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత



**ప్రజానావ, ఉట్నూర్:** ఉట్నూర్ మండలంలోని వడ్గల్ పూర్ (కె) గ్రామంలోని హనుమాన్ ఆలయంలో 5 రోజుల పాటు కొనసాగుతున్న సప్త ముగింపు కార్యక్రమానికి కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ హాజరయ్యారు. హనుమాన్ ఆలయంలో భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి, అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుగుణ మాట్లాడారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిన ప్రశాంతత నెలకొంటుందని ఆధ్యాత్మిక పూజా కార్యక్రమాలు మన సంప్రదాయాల గొప్పతనాన్ని గుర్తుచేస్తాయన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని, గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశాల్,సంతోష్ వినోద్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు వంట పాత్రలు అందజేత

**ప్రజానావ, బెజ్జూర్ :** మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం పాఠశాలలకు వంటపాత్రులను పంపిణీ చేసినట్లు ఎంఈఓ సునీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని మధ్యాహ్న భోజన కార్యక్రమం నిర్వహించు పాఠశాలలకు జిల్లా కేంద్రం నుండి వచ్చిన వంట పాత్రలు గ్యాస్ స్టవ్ లను ఆయా పాఠశాలలకు అందించడం జరిగిందన్నారు. పాఠశాలల స్టాక్ రిజిస్టర్ లో సామాగ్రిని ఎంటర్ చేసి మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అందించాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఉన్నారు.



# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పక్కా కార్యాచరణ

- ప్రధాన కూడళ్లలో, అప్రోచ్ రోడ్డు ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు
- సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజానావ, సిరిసిల్ల:** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన కూడళ్లలో, అప్రోచ్ రోడ్డు ల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేనందున అధిక సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాంటి ప్రదేశాల్లో రబ్బర్ స్ట్రిప్స్ , స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయుటకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసి సంబధిత అధికారులకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదాల నివారణకు ప్రస్తుతం రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రోడ్లపై వ్యూ అంతరాయం కలగకుండా పిచ్చి మొక్కలు పూర్తిస్థాయిలో తొలగించాలని, పెద్దగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలని, ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల్లో రేడియం సైన్ బోర్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుతూ రావాలని, దాని కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అంతర్గత ప్రాంతాల్లో జరిగే ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని రోడ్డు మరమ్మత్తు ప్రాంతాల్లో శ్రద్ధ వహించాలని, అవసరమైన చోట డివైడర్లు స్పీడ్ బ్రేకర్లు,స్పీడ్ కంట్రోల్ సోలార్ లైట్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రోడ్డు భద్రతా ప్రమాణాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. సరుకు రవాణా వాహనాలు ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, జిల్లాలోని ప్రతి విద్యాసంస్థలో రోడ్డు భద్రత ప్రమాణాల పై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. హెల్మెట్ ధరించకపోవడం, త్రిబుల్ రైడింగ్, మద్యం తాగి వాహనం నడపడం, సీట్ బెల్ట్ ధరించడం మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, అతివేగం వంటివి ప్రమాదకరమని, చట్ట ప్రకారం నేరమని ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ జిల్లా పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే తంగళ్ళపల్లి, తిప్పాపూర్ ఎక్స్‌రోడ్, గంభీరావుపేట్, కోనరావుపేట ముస్తాబాద్, చందుర్తి, బోయినపల్లి, కోదురుపాక జంక్షన్ వంటి 13 ప్రదేశాల్లో బ్లాక్ స్పాట్ లకు గుర్తించి అక్కడ రోడ్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్అండ్ బీ ఈఈ వెంకట రమణయ్య, జిల్లా రవాణా అధికారి లక్షన్ , మున్సిపల్ కమిషనర్లు, సమ్మయ్య, పీఆర్ ఈఈ సుదర్శన్ రెడ్డి , జిల్లా వైద్యాధికారి రజిత, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు,ఆర్.టి.సి. అధికారులు, నేషనల్ హైవేస్, రీజినల్ ట్రాన్స్పోర్ట్ కమిటీ మెంబర్ సంగీతం శ్రీనాథ్, అధికారులు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**ప్రజానావ, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి పంట ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ , అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి ధాన్యం కొనుగోలు పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, యాసంగి మార్కెటింగ్ సీజన్ లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రతిపాదించిన 240 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 119 ఐకేపి, 21 పాక్స్, 7 మెప్మా, 1 డి .సి.ఎం.ఎస్. మొత్తం 148 కేంద్రాలను ఓపెన్ చేశామని, మరో రెండు రోజుల వ్యవధిలో మిగిలిన 92 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకుని వచ్చే ధాన్యం తేమ శాతం , ఇతర ప్రమాణాలను చెక్ చేసి ఎఫ్.ఏ.క్యు ఉన్న ధాన్యం మద్దతు ధర పై కొనుగోలు చేసీ ఓ.పి.ఎం.ఎస్.లో ఎంట్రీ చేయాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్రక్ షీట్స్ ప్రకారం సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని, ఎక్కడైనా రైస్ మిల్లర్లు ధాన్యం దించుకొని పక్షంలో ఇంటర్మీడియట్ గోదాము లకు తరలించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఉన్న ఖాళీ గోదాము లను సమీపంలో గల కోనుగోలు కేంద్రాలకు ట్యాగ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలం సమీపంలో గల గోదాములను ధాన్యం భద్ర పరిచేందుకు హైర్ పద్దతిలో తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో డిఆర్డిఓ శేషాద్రి, డిఏఓ అఫ్జలి బేగం, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, పౌర సరఫరాల శాఖ అధికారులు రజిత, వసంత లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# వాట్ ఏ మ్యాచ్





- స్వల్ప స్కోర్ ను కాపాడుకున్న పంజాబ్
- 16 పరుగుల తేడాతో కేకేఆర్ పై విజయం
- నాలుగు వికెట్లతో రాణించిన స్పిన్నర్ చాహల్
- ఐపీఎల్ హిస్టరీలోనే గూస్ బంమ్స్ తెప్పించిన గేమ్

**ముల్లన్‌పూర్:** ఐపీఎల్ చరిత్రలో పంజాబ్ కింగ్స్ అత్యల్ప స్కోరును కాపాడుకుంది. మంగళవారం ముల్లన్‌పూర్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ స్టేడియంలో పంజాబ్ బ్యాటింగ్ ఎంచుకుని 111 పరుగులు మాత్రమే చేయగలిగింది. సమాధానంగా కేకేఆర్ 95 పరుగులకు ఆలౌట్ అయింది. పంజాబ్‌కు చెందిన యుజ్వేంద్ర చాహల్ 4 వికెట్లు తీసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు ఘోర పరాజయం ఎదురైంది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌ని కేకేఆర్ ఎప్పటికీ మర్చిపోలేదు. కేకేఆర్ లక్ష్యం కేవలం 112 పరుగులే. పంజాబ్ కింగ్స్ స్పిన్నర్లు యుజ్వేంద్ర చాహల్, మార్కో జాన్సెన్ ముందు కేకేఆర్ జట్టు నిలబడలేకపోయింది. 112 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కేకేఆర్ జట్టు కేవలం 95 పరుగులకే కుప్పకూలింది. కేకేఆర్‌కు భారీ షాక్ యుజ్వేంద్ర చాహల్ అందించాడు. అతను 4 ఓవర్లలో 28 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. మార్కో జాన్సెన్ కూడా కేవలం 17 పరుగులకు 3 వికెట్లు పడగొట్టాడు. బార్ట్‌లెట్, అర్ష్‌దీప్, గ్లెన్ మాక్స్‌వెల్ తలా ఒక వికెట్ పడగొట్టారు. కేకేఆర్‌పై 111 పరుగుల స్కోరును కాపాడుకుని పంజాబ్ కింగ్స్ చరిత్ర సృష్టించింది. ఐపీఎల్‌లో అత్యల్ప స్కోరును డిఫెండ్ చేసిన జట్టుగా నిలిచింది.

**ఈ మ్యాచ్‌లో కోల్‌కతా జట్టుకు ఏం జరిగింది?**

కోల్‌కతా జట్టు ముందు ఉన్న టార్గెట్ చాలా చిన్నది. అయితే, ముల్లన్‌పూర్ పిచ్ అంత సులభం కాదు. కేకేఆర్ ఓపెనర్లు 2 ఓవర్లలోపే ఔట్ అయ్యారు. మొదట నరైన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత డి కాక్ ఔటయ్యాడు. ఆ తరువాత, అంగ్రిక్ష్ రఘువంశీ, కెప్టెన్ రహానే ఇన్నింగ్స్ బాధ్యతలు స్వీకరించారు. ఇద్దరూ కేకేఆర్‌ను యాభై పరుగులు దాటించారు. ఈ క్రమంలో పంజాబ్ జట్టు ఓడిపోతుందని అనిపించింది. కానీ, ఆ సమయంలోనే యుజ్వేంద్ర చాహల్ ఓ అద్భుతం చేశాడు. చాహల్ మొదట కోల్‌కతా కెప్టెన్ అజింక్య రహానెను ఎల్‌బీడబ్ల్యుగా అవుట్ చేశాడు. ఆ తరువాత, అంగ్రిక్ష్ రఘువంశీ కూడా చాహల్ బాధితుడు అయ్యాడు. 28 బంతుల్లో 37 పరుగులు చేసి ఔటయ్యాడు. గ్లెన్ మాక్స్వెల్ వెంకటేష్ అయ్యర్‌ను అవుట్ చేసి మొత్తం మ్యాచ్‌కు తెరదించారు. 12వ ఓవర్లో చాహల్ వరుసగా రెండు బంతుల్లో రెండు వికెట్లు తీసి కేకేఆర్‌కు బిగ్ షాక్ ఇచ్చాడు. మొదట అతను రింకు సింగ్‌ను స్టంపౌట్ చేశాడు. తర్వాతి బంతికే అతను రమణ్‌దీప్ సింగ్ వికెట్ తీసుకున్నాడు. అతనికి మార్కో జాన్సన్, అర్ష్‌దీప్ సింగ్ నుంచి కూడా మంచి మద్దతు లభించింది. చాహల్ తన చివరి ఓవర్లో రస్సెల్‌ను 16 పరుగులు చేయగా, అర్ష్‌దీప్ వైభవ్ అరోరాను, మార్కో జాన్సెన్ రస్సెల్‌ను అవుట్ చేసి పంజాబ్‌కు అద్భుత విజయాన్ని అందించాడు.

**పంజాబ్ బ్యాటింగ్ విఫలం..**

పంజాబ్ కింగ్స్ బ్యాటింగ్ కూడా విఫలమైంది. ప్రియాంష్ ఆర్య 12 బంతుల్లో 22 పరుగులు, ప్రభ్‌సిమ్రాన్ 15 బంతుల్లో 30 పరుగులు చేసి జట్టుకు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. కానీ, ఆ తర్వాత పంజాబ్‌కు బ్యాడ్ టైమ్ మొదలైంది. హర్షిత్ రాణా పంజాబ్ టాప్ 3 బ్యాట్స్‌మెన్‌లతో వ్యవహరించాడు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ 0 పరుగులతో ఔటయ్యాడు. జోష్ ఇంగ్లిస్ కేవలం 2 పరుగులు మాత్రమే చేయగలిగాడు. నెహాల్ వాధేరా 10 పరుగులు చేయగా, మాక్స్వెల్ మళ్ళీ విఫలమయ్యాడు. కేవలం 7 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇంపాక్ట్ ప్లేయర్ సూర్యాంష్ షెడ్జ్ 4 పరుగులు చేసిన తర్వాత అవుట్ అయ్యాడు. శశాంక్ సింగ్ 18 పరుగులు, బార్ట్‌లెట్ 11 పరుగులు చేసి జట్టును 111 పరుగులకు చేర్చారు. ఈ స్కోరు చిన్నదే అయినప్పటికీ పంజాబ్ బౌలర్లు అద్భుతంగా రాణించారు.

## 11ఏళ్ల రికార్డ్ బ్రేక్ చేసిన ధోనీ



**లక్నో:** 2025 ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ మళ్లీ విజయం రుచి చూసింది. వరుసగా ఐదు ఓటముల తర్వాత, సోమవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పైతో జరిగిన మ్యాచ్‌లో చెన్నై నెగ్గింది. లఖ్‌నవూ నిర్దేశించిన 167 పరుగుల టార్గెట్‌ను చెన్నై 19.3 ఓవర్లలోనే 5వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ క్రమంలోనే సీఎస్కే కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ ఖాతాలో అరుదైన రికార్డు చేరింది. ఈ మ్యాచ్‌లో 7వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి ధనాధన్ ఇన్నింగ్స్‌తో వింజేజ్ ధోనీని గుర్తుచేశాడు. 11 బంతుల్లోనే 26 పరుగులు (4 ఫోర్లు, 1 సిక్స్) తో ఔరా అనిపించాడు. అలా చెన్నై విజయంలో ధోనీ కీలక పాత్ర పోషించిన ధోనీకి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డ్ లభించింది. ఈ క్రమంలోనే మహీ ఐపీఎల్‌లో 11 ఏళ్ల రికార్డును తిరగరాశాడు. ఐపీఎల్ చరిత్రలో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకున్న అతిపెద్ద వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. సోమవారం మ్యాచ్? నాటికి ధోనీ వయసు 43 సంవత్సరాల 280 రోజులు. ఈ క్రమంలోనే మాజీ ప్లేయర్ ప్రవీణ్ తాంబే రికార్డును బ్రేక్ చేశాడు. అతడు 2014 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ, కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై మ్యాచ్ లో 42 సంవత్సరాల 208 రోజుల్లో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డ్ గెలుచుకున్నాడు.కాగా, ఐపీఎల్?లో ధోనికి ఇది 18వ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు. 2175 రోజుల తర్వాత ధోనీ ఈ అవార్డు అందుకున్నునాడు. చివరిసారిగా ధోనీ 2019లో దిల్లీ క్యాపిటల్స్?తో మ్యాచ్?లో ఈ అవార్డు గెలుచుకున్నాడు.

## చెన్నై, సన్ రైజర్స్ జట్లలో మార్పులు

**చెన్నై:** చెన్నై సూపర్ కింగ్స్ రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ స్థానంలో ముంబైకి చెందిన ఆయుష్ మాత్రేను జట్టులోకి తీసుకుంది. రాజస్థాన్ రాయల్స్ తో మ్యాచ్ సందర్భంగా కుడి మోచేయికి గాయం అయింది. ఆ తర్వాత రెండు మ్యాచ్ లు ఆడిన రుతురాజ్.. చిన్నపాటి ఫ్రాక్చర్ మోచేయిలో ఉందని తేలడంతో ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. దీంతో కోల్ కతా నైట్ రైడర్స్ తో జరిగిన మ్యాచ్ నుంచి ఎంఎస్ ధోనీ కెప్టెన్ గా బాధ్యతలు చేపట్టాడు. ఈ మ్యాచ్ లో ఘోర పరాజయం పాలైన చెన్నై.. ఆ తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ తో జరిగిన మ్యాచ్ లో అద్భుత విజయం సాధించింది. దీంతో వరుసగా ఐదు మ్యాచ్ ల్లో ఎదురైన పరజాయాల పరంపరకు అడ్డుకట్ట వేసింది. మాత్రేను రూ.30 లక్షలకు సీఎస్కే కొనుగోలు చేసింది. దేశవాళీల్లో 9 ఫస్ట్ క్లాస్ గేమ్ లు , 7 లిస్ట్ ఏ గేమ్ లను ముంబై ఆడాడు. ఓవరాల్ గా 962 పరుగులు సాధించాడు. రోహిత్ శర్మకు బిగ్ ఫ్యాన్ అయిన మాత్రే.. ఇక నుంచి ధోనీ కెప్టెన్సీ లో ఆడనున్నాడు. చెన్నై తర్వాతి మ్యాచ్ లో ముంబై ఇండియన్స్ తో ఈనెల 20న ముంబైలో ఆడుతుంది. సన్ రైజర్స్ హైదరాబాద్ కూడా తన జట్టులో ఒక మార్పు చేసింది. గాయం కారణంగా ఆడమ్ జంపా ఈ టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. ఈ సీజన్ లో కేవలం రెండు మ్యాచ్ లు ఆడి, అంతం తమాత్రంగానే రాణించాడు. జీషాన్ అన్సారీ స్పిన్నర్ గా రాణించడంతో జంపా దాదాపుగా పెవిలియన్ కే పరిమిత మయ్యాడు. అతని స్థానంలో స్మరణ్ రవిచంద్రన్ ను ఎస్ఆర్ హెచ్ జట్టులోకి తీసుకుంది. తనను రూ.30 లక్షలతో ఒప్పందం చేసుకుంది. ఈ సీజన్ మొత్తానికి తను సన్ తో ఆడనున్నాడు. కర్ణాటకకు చెందిన స్మరణ్ రవిచంద్రన్.. దేశవాళీల్లో 7 ఫస్ట్ క్లాస్ గేమ్ లు, 10 లిస్ట్ ఏ మ్యాచ్ లు ఆడి 1100కు పైగా పరుగులు సాధించాడు. ఓవరాల్ గా స్పిన్నర్ స్థానంలో బ్యాటర్ ను ఎస్ఆర్ హెచ్ జట్టులోకి తీసుకున్నట్లయింది. ఇప్పటికే ఫియర్లెస్ బ్యాటింగ్ పవర్ తో నిండిన ఆరెంజ్ ఆర్మీలో స్మరణ్ కు అవకాశం దక్కడం కాస్త కష్టమేనని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## భారత్- బంగ్లాదేశ్ మధ్య వన్డే సిరీస్

**భారత్- బంగ్లాదేశ్ వన్డే, టీ20 షెడ్యూల్**

తొలి వన్డే - ఆగస్టు 17 (మీర్పూర్)
రెండో వన్డే - ఆగస్టు 20 (మీర్పూర్)
మూడో వన్డే - ఆగస్టు 23 (చిట్టగాంగ్)
భారత్- బంగ్లాదేశ్ టీ20 షెడ్యూల్
తొలి టీ20:ఆగస్టు 26 (చిట్టగాంగ్)
రెండో టీ20: ఆగస్టు 29 (మీర్పూర్)
మూడో టీ20:ఆగస్టు 31 (మీర్పూర్)

**భారత్- ఇంగ్లాండ్ టెస్టు షెడ్యూల్**

తొలి టెస్టు:జూన్ 20 నుంచి 24
రెండో టెస్టు:జులై 02 నుంచి -06
మూడో టెస్టు:జులై 10 నుంచి- 14
నాలుగో టెస్టు:జులై 23 నుంచి- 27
ఐదో టెస్టు:జులై 31 నుంచి- ఆగస్టు 4

### షెడ్యూల్ ప్రకటించిన బీసీసీఐ

**ముంబై:** టీమ్ఇండియా ప్లేయర్లంతా ప్రస్తుతం ఐపీఎల్‌లో బిజీగా ఉన్నారు. మరో నెల రోజుల పాటు ఫ్రాంచైజీ లీగ్‌లోనే మన ఆటగాళ్లు ఉర్రూతలూగించనున్నారు. అయితే ఈ టోర్నమెంట్ తర్వాత భారత్ ఆయా దేశాలతో మూడు ఫార్మాట్ల క్రికెట్ ఆడాల్సి ఉంది. ఇందులో భాగంగానే ఆగస్టులో బంగ్లాదేశ్?లో పర్యటించనుంది. ఈ టూర్‌లో వైట్ బాల్ సిరీస్ ఆడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ తాజాగా ఈ పర్యటన షెడ్యూల్ ప్రకటించింది. ఈ పర్యటనలో ఆతిథ్య బంగ్లాదేశ్‌తో టీమ్ఇండియా వన్డే, టీ20 సిరీస్‌ల్లో ఆడనుంది. కాగా, ఇరు దేశాల మధ్య సిరీస్ ఆగస్టు 17న ప్రారంభమై 31న ముగియనుంది. ఇందులో మూడు వన్డేలు, మూడు మ్యాచ్?ల టీ20 సిరీస్?లో భారత్ పోటీపడనుంది. అయితే ఇంగ్లాండ్ పర్యటన తర్వాత ఈ సిరీస్?లకు జట్లను ప్రకటించే అవకాశం ఉంది. అయితే ఐపీఎల్ ముగిసిన వెంటనే భారత్ జట్టు ఇంగ్లాండ్? పయనమవ్వనుంది. జూన్?లో ప్రారంభం కానున్న ఈ పర్యటనలో భారత్ 5 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ ఆగస్టు 4న ముగుస్తుంది. ఈ సిరీస్ తర్వాత టీమ్ఇండియా బంగ్లాదేశ్?లో పర్యటించనుంది. ఇదే ఏడాది అక్టోబర్?, నవంబర్, డిసెంబర్?లో టీమ్ఇండియా వరుసగా వెస్టిండీస్, సౌతాఫ్రికా జట్లతో మూడు ఫార్మట్ల సిరీస్?లో తలపడనుంది.

## మొదటి మ్యాచ్‌లో ఆకట్టుకున్న షేక్ రషీద్

**లక్నో:** చెన్నై సూపర్ కింగ్స్ 20 ఏళ్ల షేక్ రషీద్ కు అరంగేట్రం చేసే అవకాశం ఇచ్చింది. ఇప్పటి వరకు వరుస ఓటములతో బ్యాటింగ్ వైఫల్యంతో ఇబ్బంది పడుతున్న చెన్నైకు తురుపుముక్కలా దొరికాడు రషీద్. నిలకడైన, విధ్వంసకర ఓపెనింగ్ లేక చెన్నై ఇబ్బందిపడుతూ వచ్చింది. రషీద్ రావడం, కెప్టెన్సీ మార్పుతో జట్టులో కూడా చాలా ఛేంజ్ వచ్చింది. ఇన్నాళ్లు ఫ్యాన్స్ ఏది మిస్ అయ్యారో అది ఇప్పుడు జట్టులో కనిపిస్తోంది. తొలి మ్యాచ్‌లో షేక్ రషీద్ దుమ్మురేపాడు. చెన్నై విజయానికి కావాల్సిన రాబట్టడంలో లక్ష్యం దిశగా వెళ్లడానికి పునాది వేయడంలో కీలక పాత్ర పోషించాడు. రచిన్ రవీంద్రతో కలిసి చాలా కాలం తర్వాత చెన్నై జట్టు తరపున మంచి భాగస్వామ్యం నెలకొల్పాడు. డిఫెన్సివ్ మోడ్‌లో ఆడుతున్న జట్టులో ఎదురు దాడితో ఇన్నింగ్స్ స్టార్ట్ చేశాడు. ఇప్పటి వరకు రకరక ప్రయోగాలు చేసిన చెన్నై జట్టు ఇప్పుడు అసలైన ఆటగాడికి అవకాశం ఇచ్చిందని ఫ్యాన్స్ అంటున్నారు. మొదటి మ్యాచ్‌లో ఓపెనింగ్ దిగిన షేక్ రషీద్... 19 బంతులు ఆడి 27 పరుగులు చేశారు. అతని స్ట్రైక్ రేట్ 142. ఇందులో ఆరు ఫోర్లు కొట్టాడు. చూడచక్కని ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఆవేష్ ఖాన్ బౌలింగ్‌లో షాట్‌కు ప్రయత్నించి నికోలస్ పూరన్‌కు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. ఫీల్డింగ్‌లో ఉన్నప్పుడు ఓ క్యాచ్ కూడా పట్టాడు. మంచి ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్నాడు. షేక్ రషీద్ జీవిత కథ చాలా స్ఫూర్తిదాయకంగా ఉంది. ఈ యువ క్రికెటర్ పేదరికం, ఆర్థిక సమస్యలను ఎదుర్కొని లోకి అడుగుపెట్టాడు. 24 సెప్టెంబర్ 2004న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో జన్మించాడు. తన ప్రొఫెషనల్ క్రికెట్ కెరీర్‌ను హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ నుంచి ప్రారంభించాడు. మొదటి సారిగా 2022 అండర్-19 ప్రపంచకప్‌నకు ఎంపికయ్యాడు. దీంతో తొలిసారి క్రీడా ప్రపంచానికి షేక్ రషీద్ పరిచయమయ్యాడు. రావడంతోనే జట్టు వైస్-కెప్టెన్‌గా ఎంపికవ్వడం అందర్నీ ఆశ్చర్యపరిచింది.

## రిషభ్ పంత్‌పై విమర్శలు



**లక్నో:** లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో సోమవారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో లక్నో 5 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. సునాయసంగా గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో రిషభ్ పంత్ చెత్త కెప్టెన్సీ లక్నో కొంపముంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా బౌలింగ్ మార్పుల విషయంలో పంత్ ఘోర తప్పిదం చేశాడు. అద్భుతంగా బౌలింగ్ చేసిన రవి బిష్ణోయ్‌ను సరిగ్గా వాడుకోలేకపోయాడు. చివరి నాలుగు ఓవర్లలో చెన్నై సూపర్ కింగ్స్ విజయానికి 44 పరుగులు అవసరమయ్యాయి. క్రీజులో ఉన్న శివమ్ దూబే జిడ్డు బ్యాటింగ్‌తో విసిగించాడు. దాంతో లక్నో విజయం ఖాయమనుకున్నారు. కానీ 17వ ఓవర్‌లో రవి బిష్ణోయ్‌తో కాకుండా శార్దూల్ ఠాకూర్‌తో వేయించి రిషభ్ పంత్ మూల్యం చెల్లించుకున్నాడు. ఈ ఓవర్‌లో ధోనీ వరుసగా రెండు బౌండరీలు బాది మూమెంటమ్‌ను తమవైపు తిప్పుకున్నాడు. ఈ మ్యాచ్‌కు ముందే డ్యూ కారణంగా రెండో బాల్ తీసుకొచ్చారు. ఆ సమయంలో స్పిన్నర్‌తో బౌలింగ్ చేయించి ఉంటే లక్నోకు ఫలితం దక్కేది. ఆ సమయంలో కామెంటేటర్లు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ముంబై-ఢిల్లీ మ్యాచ్‌లో సెకండ్ బాల్ రాగానే కర్ణ్ శర్మతో బౌలింగ్ చేయించాలని రోహిత్ శర్మ సూచించాడు. బంతిని అందుకున్న కర్ణ్ శర్మ వికెట్ తీసి ముంబై విజయంలో కీలక పాత్ర పోషించాడు. కానీ పంత్ మాత్రం శివమ్ దూబే.. స్పిన్నర్లపై అటాక్ చేస్తాడని భావించి పేసర్లకు బంతి ఇచ్చి మూల్యం చెల్లించుకున్నాడు. అప్పటి వరకు దూబే తీవ్రంగా తడబడ్డాడు. ఆ ఓవర్‌ను రవి బిష్ణోయ్‌తో వేసి ఉంటే కచ్చితంగా వికెట్ లభించేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కేకేఆర్‌తో మ్యాచ్‌లో ధోనీ.. స్పిన్నర్ అయిన సునీల్ నరైన్ బౌలింగ్‌లో ఔటయ్యాడని గుర్తు చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ధోనీ పేస్ బౌలింగ్‌ను ఆడినట్లు స్పిన్ ఆడలేకపోతున్నాడని కామెంట్ చేస్తున్నారు.

## అక్షర్ పటేల్ పై రూ.12 లక్షల జరిమానా



**ముంబై:** ముంబై ఇండియన్స్ చేతిలో ఆదివారం జరిగిన మ్యాచ్ లో ఓడిపోయి నిరాశలో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ కు షాక్ తగిలింది. ఆ జట్టు కెప్టెన్ అక్షర్ పటేల్ పై రూ.12 లక్షల జరిమానాను బీసీసీఐ విధించింది. మ్యాచ్ లో స్లో ఓవర్ రేట్ మెయింటేన్ చేసినందుకుగాను, అతడిపై కొరడా ఝుళిపించింది. ఈ సీజన్ లో ఢిల్లికిది తొలి తప్పే కాబట్టి, జరిమానాను విధిస్తున్నట్లు పేర్కొంది. ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ లోని ఆర్టికల్ 2.22ను అతిక్రమించినందుకుగాను ఢిల్లీ కెప్టెన్ కు ఈ శిక్ష పడింది. ఇక నాలుగు వరుస విజయాలతో జోరుమీదున్న ఢిల్లీకి ఒరిజినల్ సొంతగడ్డ అయిన ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియంలో బ్రేక్ పడింది. ఈమ్యాచ్ లో 12 పరుగుల తేడాతో ముంబై చేతిలో ఓడిపోయింది. దీంతో ఈ సీజన్ లో తొలి ఓటమిని ఢిల్లీ మూటగట్టుకుంది. నిజానికి ప్రత్యామ్నాయ సొంతగడ్డ అయిన విశాఖ పట్నంలో ఆడిన రెండు మ్యాచ్ లు గెలిచిన ఢిల్లీ.. అరుణ్ జైట్లీ స్టేడియంలో మాత్రం ఓడిపోయింది.

## పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో విరాట్ క్రేజ్


**కరాచీ:** భారత దిగ్గట బ్యాటర్ విరాట్ కోహ్లీకి ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. భారత్ గురించి తరచుగా చెడుగా మాట్లాడే పాకిస్తాన్ లాంటి దేశంలో కూడా విరాట్ కోహ్లీకి అభిమానులు ఉన్నారు. ఇండియాలో జరుగుతున్న ఐపీఎల్ 2025 లాగానే.. పాకిస్తాన్ సూపర్ లీగ్2025 పొరుగుదేశమైన పాకిస్తాన్‌లో ప్రస్తుతం జరుగుతోంది. పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో భాగంగా సోమవారం రావల్పిండి క్రికెట్ స్టేడియంలో ఇస్లామాబాద్ యునైటెడ్, పెషావర్ జల్మి జట్ల మధ్య ఒక మ్యాచ్ జరిగింది. అక్కడ విరాట్ కోహ్లీ క్రేజ్ కనిపించింది. ఆ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ అభిమాని కూడా కనిపించాడు. ఆ అభిమాని ధరించిన జెర్సీపై విరాట్ కోహ్లీ ఐకానిక్ నంబర్ 18 అని రాసి ఉంది. ఈ అభిమాని ఫోటో వెంటనే సోషల్ మీడియాలో వైరల్ అయింది.

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

8

బుధవారం
16 ఏప్రిల్ 2025

## దంగల్ నటి లవ్ మ్యాటర్ రివీల్!

బ్లాక్ బస్టర్ హిట్ దంగల్ మూవీతో బాలీవుడ్ బ్యూటీ ఫాతిమా సనా షేక్ మంచి గుర్తింపు సంపాదించుకున్న విషయం తెలిసిందే. ఆ సినిమాతోనే పాన్ ఇండియా లెవెల్ లో పాపులర్ అయిన ఆ నటి.. అంతకుముందు తెలుగులో కూడా నటించింది. రీసెంట్ గా తెలుగు నిర్మాతపై క్యాస్టింగ్ కౌచ్ ఆరోపణలు చేసి వార్తల్లో నిలిచింది. ఇప్పుడు ఆ బ్యూటీ.. తన ప్రేమ వ్యవహారంపై ఓపెన్ అయింది! దీంతో ఆమె ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్.. ఇప్పుడు ఫుల్ వైరల్ గా మారింది. అయితే చీరలతో తనకు పూర్తి స్థాయి ప్రేమ ఉందని రాసుకొచ్చింది. అదిరిపోయే శారీలో దిగిన పిక్స్ షేర్ చేయగా.. ఇప్పుడు ఇన్ స్టాలో ఆమె ఫోటోలు తెగ చక్కర్లు కొడుతున్నాయి. స్పెషల్ ఇయర్ రింగ్స్ పెట్టుకున్న అమ్మడు.. చీరలో ఇచ్చిన పోజులు వేరే లెవెల్ అని చెప్పాలి. ఒక్క ఫోటో ఓ రేంజ్ లో ఉందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. చీరలో అదిరిపోయారని చెబుతున్నారు. అందమే అసూయ పడేలా ఉన్నారని అంటున్నారు. శారీ లవ్ అంటూ హ్యాష్ ట్యాగ్ ఇస్తూ లైక్స్ కొడుతూ సందడి చేస్తున్నారు. ఇక కెరీర్ విషయానికొస్తే.. మొట్టమొదటి ఫీల్డ్ మార్షల్ సామ్ మానెక్షా జీవితం ఆధారంగా రూపొందిన వార్ డ్రామా సామ్ బహదూర్ మూవీతో రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది ఫాతిమా. ఇప్పుడు అనురాగ్ బసు దర్శకత్వం వహించిన మెట్రో ఇన్ డినోతో సందడి చేయనుందన్న విషయం అందరికీ తెలిసిందే.




## స్పెషల్ అట్రాక్షన్‌గా రామరామ

టాలీవుడ్ స్టా ర్‌యాక్ట ర్‌చిరంజీవి కాంపౌండ్ నుంచి వస్తోన్న సోషియో ఫాంటసీ ప్రాజెక్ట్ విశ్వంభర బింబిసార ఫేం వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. అమిగోస్‌ఫేం ఆషికా రంగనాథ్, రమ్య పసుపులేటి, సురభి, ఈషా చావ్లా, ఆశ్రిత వేముగంటి నండూరి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఇటీవలే ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ రమ రామను విడుదల చేశారని తెలిసిందే. ఈ పాటకు మ్యూజిక్ లవర్స్ నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ పాట యూట్యూబ్‌లో నంబర్ 1 ప్లే స్‌లో -టె-ండిరగ్ అవుతోంది. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను ఎంఎం కీరవాణి కంపోజ్ చేయగా.. శంకర్ మహదేవన్, ఐరా ఉడుపి, లిప్సికా భాష్యం పాడారు. రామ రామ సాంగ్ విశ్వంభరకు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తు ందనడంలో ఎలాంటి సందేహం లేదని తాజా వార్త చెప్పకనే చెబుతోంది. ఈ మూవీని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్‌విక్రమ్ తెరకెక్కిస్తుండగా.. ఇప్పటికే రిలీజ్ చేసిన విశ్వంభర -టైటిల్ లుక్, కాన్సెప్ట్ వీడియో మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేయనుండగా.. మేకర్స్ నుంచి స్పష్ట త రావాల్సి ఉంది.



## అమీర్‌ను డైరెక్ట్ చేయనున్న వంశీపైడిపల్లి

కొంతకాలంగా వంశీ పైడిపల్లి బాలీవుడ్ ఎంటర్‌పై దృష్టి సారించాడు. అమీర్ ఖాన్ హీరోగా ఓ చిత్రాన్ని నిర్మించే క్రమంలో ఆయనకు స్టోరీ లైన్ చెప్పినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తమిళనాడులో విజయ్‌తో ఓ సినిమాచేసిన వంశీ పైడిపల్లి ఇప్పుడు హిందీలోకి అడుగు పెట్టాలని చూస్తున్నారు.దిల్ రాజు ఈ సినిమాకు కూడా నిర్మాతగా వ్యవహరించబోతున్నట్టు-గా చెబుతున్నారు. ఇటీవల ఆయన ప్రొడ్యూస్ చేసిన పాన్ ఇండియా లెవెల్‌లో మరో క్రేజీ ప్రాజెక్టు పట్టాలెక్కేలా కనిపిస్తోంది. బాలీవుడ్‌సూపర్ స్టా ర్‌ఆమిర్ ఖాన్ , టాలీవుడ్‌డైరెక్ట ర్‌వంశీ పైడిపల్లితో సినిమా వర్కవుట్ అయ్యేలా ఉందన్న టాక్ వినిపిస్తో ంది. టాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్న న్యూస్ ప్రకారం.. వంశీ చెప్పిన సింగిల్-లైన్ ప్లా ట్‌ఆమిర్‌ని ఫిదా చేసిందట. దీంతో పూర్తి స్క్రిప్ట్ కోసం ఆమిర్‌ఆసక్తి గా ఎదురుచూస్తున్నాడని తెలుస్తోంది. వంశీ తన రైటర్స్ టీమ్‌తో స్క్రిప్ట్‌ని డెవలప్ చేస్తున్న స్టై ల్‌ఆమిర్‌కి బాగా నచ్చిందట. స్క్రిప్ట్ రెడీ అయిన వెంటనే మేకర్స్ ఆయనకు-చెప్పబోతున్నట్టుగా తెలుస్తోంది. కొంతకాలంగా వంశీ పైడిపల్లితో పాన్ ఇండియా ట్రావెల్ చేస్తున్న దిల్ రాజు నే ఈ సినిమాకు కూడా నిర్మాతగా వ్యవహరించబోతున్నట్టు గా చెబుతున్నారు.



## కథ కోసం నానా తంటాలు పడతా

'కల్కి'లో ప్రతి సన్నివేశానికి బ్యాక్‌గ్రౌండ్‌లో ఎంతో వర్క్ చేశాం. తెరపై చూశాక అది ఫైటింగ్ సీన్ అంటారు. కానీ, దాని వెనక ఎంతో కష్టం ఉంటుందని దర్శకుడిగా తన అనుభవాలను పంచుకున్నారు నాగ్‌అశ్విన్ . తాజాగా కాలేజ్ స్టూడెంట్స్‌తో ముచ్చటించిన ఆయన ఇండస్ట్రీలో తన అనుభవాలను పంచుకున్నారు. వారితో కొన్ని ఆసక్తికర విషయాలను చెప్పారు. చేసే పని ఏదైనా వందశాతం కష్టపడాలి. షార్ట్ ఫిల్మ్, సినిమా ఏదైనా ఇదే చివరిది అని భావించి తీయాలి. నేను బుక్స్ బాగా చదువుతాను. సినిమాల కంటే పుస్తకాలు మనపై ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. పరిశ్రమలో కొనసాగాలంటే పుస్తకాలు చదవడం కూడా ముఖ్యమే. మనం అనుకున్న కథను ప్రేక్షకులకు అర్థం అయ్యేలా రాయగలగాలి. ఒక సామాన్య కథను కూడా ఆసక్తిగా రాయాలి. ఆ సినిమా వెనక నా ఒక్కడి కష్టం మాత్రమే లేదు. అది ఒక టీమ్ కష్టం. టీమ్‌లోని అందరి సలహాలు వింటాను. చిన్నప్పటి నుంచి మహాభారతం గురించి తెలుసు. దాని ఆధారంగా సినిమా తీయాలంటే కొంచెం భయపడ్డానని చెప్పారు. నేను కొన్ని ప్రాజెక్ట్‌లకు ఎడిటర్‌గా కూడా వర్క్ చేశాను. సినిమా బాగా రావడానికి ఎడిటింగ్ ప్రధానం. మొదట స్టోరీ రాసుకుంటాను. అందులోని పాత్రల ఆధారంగా నటీనటులను ఎంపిక చేసుకుంటాను. కల్కిలో పాత్రలు రాసిన తర్వాత మొదట అమితాబ్ బచ్చన్‌ను, తర్వాత ప్రభాస్‌ను సెలక్ట్ చేసుకున్నాను. ది నేను డైరెక్ట్ చేస్తే బాగుండేది అని ఏ సినిమాకు అనిపించలేదు. కానీ, 'ఖలేజా 'డియర్ కామ్రేడ్ ' సినిమాలను నేను ఎడిట్ చేసి ఉంటే బాగుండేది అనిపించింది. నాకు కామెడీ సినిమాలు అంటే ఇష్టం. ముఖ్యంగా జంధ్యాల సినిమాలు నచ్చుతాయి. నేను ఏదైనా రాసుకున్న తర్వాత రెండు నెలలకు అదే ఐడియా వేరే సినిమా -ట్రైలర్‌లో కనిపిస్తుంది. దీంతో దాన్ని పక్కన పెట్టాల్సి వస్తుంది. 2008లో ఒక కథ రాసుకున్నాను. జ్ఞాపకాలు, కలలు ఈ రెండు అంశాలతో రాశాను. ఇదే కాన్సెప్ట్‌తో వచ్చిన హాలీవుడ్ సినిమా 'ఇన్‌సెప్షన్' ట్రైలర్ చూశాక వారం రోజులు డిప్రెషన్‌లోకి వెళ్లా ను. ఎంతో కష్టపడి కొత్తగా ఒక కథను రాస్తే గుర్తించే వారికంటే.. గతంలో వచ్చిన లవ్ స్టోరీనే మరోసారి తెరకెక్కిస్తే దాని గురించి మాట్లాడేవారు ఎక్కువమంది ఉంటారు. అందుకే ఎప్పుడూ కొత్తగా రాసుకోవాలి. ఎక్కడా రాని పాయింట్ గురించి సినిమాలు తీయాలని అన్నారు.

## కథను నమ్మితే... ఇక రంగంలోకి దిగిపోతా

విజయ్ సేతుపతి హీరోగా దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ సినిమా రూపొందించనున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాను ప్రకటించినప్పటినుంచి రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. పూరి ఫామ్‌లో లేరని ఆయన స్క్రిప్ట్‌ను ఎందుకు ఎంచుకున్నారంటూ విజయ్ సేతుపతిని ట్యాగ్ చేస్తూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా దీనిపై ఈ హీరో స్పందించారు. దీనికి తనదైన శైలిలో సమాధానమిచ్చారు. పూరి జగన్నాథ్‌తో నేను చేయనున్న సినిమా షూటింగ్ జూన్‌లో ప్రారంభం అవుతుంది. గతంలో వారు చేసిన సినిమాల ఫలితాల ఆధారంగా దర్శకులను జడ్జ్ చేయను. స్క్రిప్ట్ నచ్చితే సినిమా చేస్తాను. పూరి చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. అందుకే అంగీకరించాను. ఇలాంటి కథ ఇప్పటివరకూ చేయలేదు. నేను ఎప్పుడూ కొత్త వాటికి ప్రాధాన్యం ఇస్తాను. గతంలో చేసిన స్టోరీలు రిపీట్ కాకుండా చూసుకుంటాను. ఈ సినిమాలో టబు ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆమె గొప్ప నటి. టాలెంటెడ్ కోస్టా ర్. గతంలో ఎప్పుడూ ఆమెతో కలిసి స్క్రీన్ పంచుకోలేదు. ఈ సినిమాలో ఆమెతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. విజయ్ సేతుపతి: నేను ఇప్పటివరకూ చేసిన చిత్రాల్లో 'మహారాజ' నాకు ప్రత్యేకమైనది. అందులోని పాత్ర కష్ట మైనది. పిల్లలపై జరుగుతోన్న అఘాయిత్యాలకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు ఉన్నాయి. వాటిలో నటించేటప్పుడు వణికిపోయాను. 'సూపర్ డీలక్స్, 'ఉప్పెన'లోని పాత్రలు కూడా కష్టమైనవే. కానీ 'మహారాజ' నా హృదయాన్ని హత్తుకుంది. ఎందుకంటే నేను నిజజీవితంలోనూ ఒక కుమార్తెకు తండ్రినే కదా. నేను బలమైన సందేశం ఉన్న సినిమాలు ఎంచుకుంటాను. అదే నా బలం. పూర్తిగా వినోదాత్మక చిత్రాలలో నటించకూడదని కాదు.. వినోదంతో పాటు సందేశం కూడా ఉండాలి. పూరి సినిమాతో పాటు- మరో రెండు తమిళ ప్రాజెక్ట్‌లు చేస్తున్నాను. మిస్కిన్ దర్శకత్వంలో 'ట్రైన్' చిత్రంలో నటిస్తున్నాను. ఇది యాక్షన్ చిత్రం. దీనితో పాటు మరో మర్డర్ మిస్ట రీలో నటిస్తున్నాను.






## కొత్త చిత్రాలతో సందడి

ఉగాదితో తెలుగువారందరికీ కొత్త సంవత్సరం ప్రారంభమైనట్టు- కేరళ, తమిళనాడు ప్రాంత వాసులకు ఏప్రిల్ 14తో నూతన సంవత్సరం మొదలైంది. ఈ విషును తారలంతా ఘనంగా సెలబ్రేట్ చేసారు. ఈ సందర్భంగా కోలీవుడ్, మాలీవుడ్ హీరోలు తమ రాబోయే చిత్రాలకు సంబంధించి అప్ డేట్స్ షేర్ చేసుకున్నారు. అమరన్ తో సూపర్ హిట్ కొట్టిన శివ కార్తికేయన్ తాజాగా మురుగదాస్ డైరెక్షన్ లో చేస్తున్నసినిమా మదరాసి రిలీజ్ డేట్ కన్ఫర్మ్ చేసింది యూనిట్. సెప్టె ంబర్5కే థియేటర్ల లో బొమ్మ రాబోతుంది. మాలీవుడ్ స్టా ర్ యాక్ట ర్. నివిన్ పౌలీ విషు సందర్భంగా ఓ సినిమాను స్టా ర్ట్‌చేశాడు. బేబీ గర్ల్ అనే మూవీకి ఏప్రిల్ 14న కొబ్బరి కాయ కొట్టారు. ఫస్ట్ కుంచికో బొబన్ హీరోగా అనుకుంటే ఆయనకున్న కమిట్‌మెంట్స్ వల్ల డేట్ అడ్జస్ట్ చేయలేకపోవడంతో ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ నివిన్ చెంతకు చేరింది. 2023లో మలయాళంలో వచ్చిన గరుడన్ ఫేం అరుణ్ వర్మ ఈ చిత్రానికి దర్శకుడు. ఫహాద్ ఫజిల్, కళ్యాణీ ప్రియదర్శన్ జంటగా నటిస్తోన్న మూవీ ఒదుం కుతిరా చదూం కుతిరా ఫస్ట్ లుక్ పోస్ట ర్ విషు సందర్భంగా రిలీజ్ చేశారు. రొమాంటిక్ కామెడీ జోనర్‌లో క్రేజీ వెడ్డింగ్ స్టోరీగా తెరకెక్కిస్తున్నాడు డైరెక్ట ర్ అల్తాఫ్ సలీమ్. అలాగే తెలుగులో ఈగ తరహాలో మలయాళంలో ఈ`లపైతో సరికొత్త ప్రయోగం చేస్తున్నారు. లవ్లీ అనే -టైటిల్‌తో తెరకెక్కుతోన్న మూవీ నయా అప్డేట్ వచ్చింది. ఈ సినిమాను గతంలో ఏప్రిల్ 4న విడుదల చేయాలనుకోగా ఇప్పుడు మే 4కు పోస్ట్ పోన్ అయిందని తెలుపుతూ పోస్ట ర్ రిలీజ్ చేసారు. మొత్తానికి పండగ కానుకాగా సినిమాల విశేషాలను ప్రేక్షకులతో షేర్ చేసుకున్నారు మేకర్స్.



## మైత్రీ మూవీ మేకర్స్‌కు రాజా నోటీసులు

టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కు ప్రముఖ సంగీత దర్శకులు ఇళయరాజా నోటీసులు పంపారు. తెలుగులో అగ్రగామి సంస్థగా సినిమాలు రూపొందిస్తున్న మైత్రీ మూవీ మేకర్స్ గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాతో తమిళ సినిమా పరిశ్రమలో అడుగుపెట్టింది. కోలీవుడ్ స్టా ర్‌హీరో అజిత్‌కుమార్ హీరోగా యంగ్‌డైరెక్ట ర్ ఆదిక్ దర్శకత్వంలో భారీ బడ్జెట్ పై ఏఇ ైఖ సినిమాను నిర్మించారు. ఏప్రిల్ 10న వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయిన ఈ సినిమా బ్లా క్‌బెస్ట ర్‌హిట్ టాక్ తెచ్చుకుని రికార్డ్ స్థాయి కలెక్షన్స్ రాబడుతోంది. అయితే ఈ సినిమాలో కొన్ని సీన్స్ లో ఒకప్పటి తమిళ్ సినిమాలలోని ఇళయరాజా సంగీతం అందించిన సాంగ్స్ ను గుడ్ బ్యాడ్ అగ్లీ లో వారిని రీమిక్స్ చేసి ఉపయోగించారు. ఆ సదరు సీన్స్ థియేటర్స్ లో ఫ్యాన్స్ ఆ సాంగ్స్ ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. అందుకు సంబందించి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అయితే తన పాటను అనధికారికంగా వాడుకోవటం పై ఇళయరాజా ఆగ్రహం వ్యక్తం చేసారు. సినిమాలో తన పాటలు వాడడం పై నోటీ-సులు ఇచ్చారు ఇళయరాజా. నష్టపరిహారం కింద తనకు ఐదు కోట్ల రూపాయలు చెల్లి ంచాలయూ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కు నోటీ-సులు పంపారు ఇళయరాజా. అదే విధంగా గుడ్‌బ్యాడ్ అగ్లీలోని మూడు పాటలను వెంటనే నిలిపివేయాలని మరియు 7 రోజుల్లోగా చిత్ర బృందం బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఇళయరాజా డిమాండ్ చేసారు. మరి ఇప్పుడు మైత్రి మూవీ మేకర్స్ ఈ నోటిసులపై ఎలా స్పందిస్తారో చూడాలి.


Printed, Published and Owned by **Adula Thirupathi,** and Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, and Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TELTEL/2023/87657** Email: prajanaava@gmail.com. Phone No: **99484 33277.**